Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 20 Issue No : 20 | ఆదివారం Sunday | ఏప్రిల్ 19, 2026 19 APRIL 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన

## ఇరాన్

టెహ్రాన్ : హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివే స్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది.

వివరాలు 2లో..



కొండ మలుపులో అదుపుతప్పిన టూరిస్టు

## వాహనం

- 9 మంది మృతి

చెన్నై : తమిళనాడు సేలం జిల్లాలో శనివారం ఓ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక టూరిస్ట్ వాహనం కొండ మలుపులో అదుపుతప్పి కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదం లో ఏడుగురు ఉపాధ్యాయులతో సహా 9 మంది మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు.

- మిగతా 2లో..

గొడ్డలి పార్టీకి తెలిసింది

# కూల్చడం.. నరకడమే



ఇక్కడ ఉన్నది 1995 సీఎం..గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను

- మహిళల్ని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటు
- మహిళల ఓట్లు అడిగే పార్టీలు రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవడమేంటి ?
- 33% రిజర్వేషన్లు అమలయ్యే దాకా పోరాడతాం
- జూన్ నాటికి పట్టణాల్లో 100% చెత్త క్లియర్
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం

ప్రజాభూమి ప్రతినిధి,నిడదవోలు : "సుపరిపాలనే కూటమి లక్ష్యం. రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీంతో 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గత ప్రభుత్వం పోలవరం డయాఫ్రంవాల్ ను గోదావరిలో కలిపేసింది. కేంద్ర సహకారంతో గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. గతంలో రాజధానికి రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. తాజాగా 10 గ్రామాల రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మన రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఒకటుంది. పేదలకు కడుపునిండా తిండి పెట్టడానికి వారికి మనసు రాదు.

పేదలకు పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యంతో మనం తెచ్చిన అన్న క్యాంటీన్లను కక్షతో మూసేశారు. ప్రజా ప్రభుత్వంలో 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. పేదలకు కడుపు నిండా తిండి పెట్టలేని ప్రభుత్వాలు ఉన్నా ఒకటే...లేకపోయినా ఒకటే. గొడ్డలి పార్టీ వల్ల ప్రజలకు ఉపయోగం లేదు. గొడ్డలిపార్టీకి తెలిసిందల్లా విధ్వంసం, కూల్చడం, నరకడమే. రాష్ట్రంలో సీబీఎన్, పవన్ కల్యాణ్... కేంద్రంలో నరేంద్ర మోదీ ఉన్నారని వారు గుర్తుంచుకోవాలి. ఎవర్నీ వదిలిపెట్టం."అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

2 పేజీలో..



పాత మహిళా రిజర్వేషన్ బిల్లును

## అమలు చేయాలి

ప్రధానికి ప్రతిపక్షం లేఖ

న్యూఢిల్లీ : పాత మహిళా రిజర్వేషన్ బిల్లు (2023 లో ఆమోదించిన) ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షం శనివారం ప్రధాని మోడీకి లేఖ రాసింది. నేడు ఈ విషయంపై ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ లోక్‌సభలో కీలక బిల్లులకు మెజార్టీ ఓటింగ్ లేకుండా చేసినందుకు ఆమె మిత్రపక్షాలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశం అనంతరం ఇండియా బ్లాక్ ఎంపీలు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ మీడియా సమావేవంలో మహిళా రిజర్వే షన్‌కు తాము మద్దతు ఇస్తున్నా ము. కానీ ప్రభుత్వం రిజర్వేషన్ ముసుగులో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని ఇండియా బ్లాక్ పార్టీలు వివరిం చనున్నట్లు తెలుస్తోంది. కాగా, నేడు కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని పార్టీలు ఆమోదించిన పాత మహిళా బిల్లును కేంద్రం సోమవారం నాడే వెంటనే పార్లమెంటు ముందుక తీసుకురావాలి.

2 లో



కర్నూలు ఘోర

## ప్రమాదం

10కి చేరిన మృతుల సంఖ్య

మంత్రాలయం (కర్నూలు) : మండల పరిధిలోని చిలకలడోన గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 10 కి చేరింది. గురువారం తెల్లవారుజామున బొలేరా వాహనం మిక్సీ ట్యాంకర్ లారీ నీ ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే ఐదుగురు మృతి

2 లో



మరోసారి శాంతి చర్చలకు

## సిద్ధమైన అమెరికా - ఇరాన్

ఇస్లామాబాద్ : అమెరికా- ఇరాన్‌లు యుద్ధానికి ముగింపు పలకడానికి మరోసారి శాంతి చర్చలకు సిద్ధమయ్యాయి. పాకిస్తాన్‌లో తాజాగా వచ్చే సోమవారం రెండో దఫా శాంతి చర్చలు జరుపుకోనున్నట్లు ఇరాన్ అధికారులు మీడియాకు వెల్లడించారు. దీని కోసం ఇరుపక్షాల ప్రతినిధుల బృందాలు ఆదివారం పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని ఈ చర్చల గురించిన సమాచారం తెలిసిన ఇరాన్ అధికారులు సిఎన్‌ఎన్ మీడియా తెలిపారు.కాగా, అమెరికా - ఇరాన్‌లు ఏప్రిల్ 11-12 తేదీల్లో జరిపిన శాంతి చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

రాజ్యాంగ సవరణ బిల్లు

# వీగిపోవడం ఆనందం

## దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు

- వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి

చెన్నై, : లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026 వీగిపోయింది. దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది.

- మిగతా 2లో..





రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం

## శుభవార్త

- భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు విడుదల
- మార్చి 22న తొలి విడత నిధులు సిద్దిపేట జిల్లాలో విడుదల చేసిన సీఎం

- మిగతా 2లో..

మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవటం

# జాతికి ద్రోహం

- సీఎం చంద్రబాబు
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల ర్యాలీ



ప్రజాభూమి ప్రతినిధి, రాజమహేంద్రవరం : పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం ద్వారా జాతికి ద్రోహం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయం టూ..శనివారం నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు మహిళలకు అన్యాయం చేశాయన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే అని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని, సుదీర్ఘ కల సాకారం అవుతుందని అందరం భావించామని తెలిపారు.

పార్లమెంట్, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నామన్నారు. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతిలో భాగం అని చెప్పారు. ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలుంటారని మన నానుడి.. నిన్న పార్లమెంటులో దానికి భిన్నంగా జరిగిందని ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా నిడుదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ చేపట్టాయన్నారు. మహిళలంతా బయటకు వచ్చి నిరసన తెలిజేయాలని పిలుపు ఇస్తున్నానన్నారు. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోంమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారని వివరించారు. ఎపి లో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగేవి...

2 పేజీలో..



## అంబటి రాంబాబు నిరాహారదీక్ష..

- ఎవరినీ వదిలిపెట్టను అంటూ వార్నింగ్
- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు దీక్ష
- తన ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని నిరసన
- ఇద్దరు సీఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్

2 లో..

ప్రజాభూమి
ఆదివారం, ఏప్రిల్ 19, 2026


## సంపాదకీయం

# విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపో యింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తిరస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్ధంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెం టులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుం డానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవ టంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

## హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్

అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

## కొండ మలుపులో అదుపుతప్పిన టూరిస్టు వాహనం

దీంతో కేరళలోని పాంగ్-పల్లిపరంబ పభుత్వ స్కూల్‌లో విషాదం నెలకొన్నది. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి సేలంకి వెళ్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. కేరళలోని మలప్పురం జిల్లా పాంగ్-పల్లిపరంబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బందితో కూడిన 13 మంది పర్యటన కోసం తమిళనాడు వెళ్లారు. శుక్రవారం ట్రావెల్ టెంపో వాహనంలో వాల్పరై హిల్ స్టేషన్‌ను సందర్శించారు. వాల్పరైలో పర్యటన ముగించుకుని కొండ నుంచి కిందకు దిగుతుండగా ఆ వాహనం ప్రమాదానికి గురైంది. 13వ హెయిర్‌పిన్ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందకు దూసుకెళ్లింది. 9వ హెయిర్‌పిన్ మలుపులోని రోడ్డుపై బోల్తాపడింది. ఆ వాహనంలో ఉన్న 13 మందిలో ఒక బాలిక, ఏడుగురు మహిళలు, ఒక పురుషుడితో సహా 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మరోవైపు ట్రావెల్ వాహనం డ్రైవర్, మరో ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. వీరిలో ఇద్దరిని కోయంబత్తూరు వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ, కేరళ సీఎం విజయన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# గొడ్డలి పార్టీకి తెలిసింది కూల్చడం, నరకడమే

కాంగ్రెస్ నేతృత్వంలోని మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేదని, కానీ ప్రతిసారీ మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకు అలవాటుగా మారిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు ఎన్నటికీ మనుగడ సాగించలేవని, మహిళలకు 33 % రిజర్వేషన్లు అమలయ్యే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వర్ణాంధ్రహో- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఆడబిడ్డలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రం బిల్లు పెడితే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు అడ్డుకున్నాయి. రిజర్వేషన్లు సాధించే వరకూ ఆడబిడ్డలకు అండగా ఉంటాం. కాంగ్రెస్ సహా దాని మిత్రపక్షాలు మహిళ బిల్లును ఎందుకు అడ్డుకున్నారో సమాధానం చెప్పాలి. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు... నేను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా ఉన్నాను. ఆనాడు బిల్లు పెట్టేందుకు కాంగ్రెస్ సపోర్టు చేసేందుకు ఒప్పుకోకపోవడంతో విత్ డ్రా చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రధానిగా వాజ్ పేయి హయాంలో నాలుగు సార్లు బిల్లు తెచ్చారు. ప్రతిసారీ బిల్లు పాస్ కాకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. 2010లో యూపీఏ అధికారంలో ఉండగా మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదించారు. దాన్ని బీజేపీ కూడా సమర్థించింది. కానీ లోక్ సభకు బిల్లు తీసుకురాకుండా మహిళలకు కాంగ్రెస్ ద్రోహం చేసింది. ప్రధాని మోదీ 2023లో మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొస్తే అందరూ సహకరించారు.

దేశంలోని మహిళలకు సముచిత గౌరవం ఇవ్వాలని ప్రధాని మోదీ పట్టుదలతో బిల్లు తీసుకొస్తే మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకూ సమంజసం? చిన్న రాష్ట్రాలు, దక్షణాది రాష్ట్రాలకు డీ లిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందంటున్నారు. ఆ లాజిక్ ఏంటో నాకు అర్థం కావడంలేదు. ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే 50 శాతం పెరుగుతాయని పార్లమెంటు సాక్షిగా హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వాజ్ పేయి హయాంలో 1971 లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది. 1996 నుంచి 2026 వరకూ 30 ఏళ్లుగా మోసం చేస్తూనే ఉన్నారు. మహిళా బిల్లు ఎప్పుడు పాస్ అవుతుందో ఆ దేవునికే తెలియాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా మేము 2017లోనే అసెంబ్లీలో తీర్మానం చేశాం. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళలకు చేసిన మోసంపై ప్రజా చైతన్యం తీసుకొస్తాం.. మహిళలను చట్టసభల్లో చూడాలన్నది నా ఆకాంక్ష. కాంగ్రెస్ నుంచి వచ్చిన తోక పార్టీ రాష్ట్రంలో ఉంది. వారికి మహిళల సమస్యలు పట్టవు. మహిళలను గౌరవించినప్పుడే సమాజం ముందుకు వెళుతుంది."అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**మహిళల సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించాం**

"మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇంటిని సమర్థవంతగా నిర్వహించడంలో మహిళలు ముందున్నారు. దేశంలోనే మొదటిసారిగా మహిళలకు ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. ఆస్తిలో సమానహక్కు ఇచ్చారు. మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నేను మహిళల ఆర్థిక ప్రగతి కోసం డ్వాక్రా సంఘాలు స్థాపించాను. నేడు డ్వాక్రా మహిళలు రూ. 50 వేల కోట్ల రుణాలు తీసుకుంటున్నారు. రూ. 25 వేల కోట్ల కార్పస్ ఫండ్ పొదుపు సంఘాల దగ్గరుంది. మహిళలకు ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాను. దీంతో వరకట్న సమస్యను పూర్తిగా రూపుమాపాం. ఐటీలో భర్త కంటే భార్యనే ఎక్కువగా సంపాదిస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన 63 లక్షలమందికి పింఛన్లు ఇస్తున్నాం. ఇందుకోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఉద్యోగస్తులు కూడా బస్సులో ఉచిత ప్రయాణం చేస్తూ ఎక్కడికైనా వెళుతున్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**జూన్ నాటికి పట్టణాల్లో 100 శాతం చెత్త క్లియర్**

"రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ముందుకెళ్తోంది. నేను 4వ సారి ముఖ్యమంత్రిగా పని చేస్తున్నాను. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 15 నెలలుగా నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా 3వ శనివారం ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతున్నాను. ఈసారి జలధార-జలహారతి థీమ్ తో ముందుకొచ్చాం. గత పాలకులు రాష్ట్రాన్ని చెత్తకుప్పగా మార్చేశారు. భూమి పైనే కాదు భూమి లోపల కూడా చెత్త వేశారు. ఎక్కడ చూసిన చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. ఒక పద్ధతి ప్రకారం పని చేస్తున్నాం. ప్రజల్లోనూ చైతన్యం రావాలి.

మన ఇల్లు, మన వీధి, మన ఊరు, మన ఆఫీసు, మన స్కూళ్లు, కాలేజీలు, పబ్లిక్ ప్లేస్‌లు, బీచ్‌లు, ఆలయాలు, పార్కులు పరిశుభ్రంగా ఉండాలి. జపాన్ లో రోడ్లపై ఒక్క చిన్న పేపర్ ముక్క కూడా కనిపించదు. ఆ స్ఫూర్తి మనలోనూ రావాలి. ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామీణ ప్రాంతాల్లో 1,430 టన్నులు... మొత్తంగా 8,957 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త తొలగించాం. ఈ జూన్ నాటికి 100 శాతం క్లియర్ చేస్తాం. ప్రభుత్వ చర్యలతో పట్టణాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ 86 శాతం నుంచి 97 శాతానికి పెరిగింది. త్వరలోనే 100 శాతం సాధించేలా ఎలక్ట్రిక్ వాహనాలు తెస్తున్నాం. రాష్ట్రంలో చెత్త ప్రాసెసింగ్ 57 శాతం నుంచి 100 శాతానికి పెంచుతాం. రూ.603 కోట్లతో 107 ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్టోబర్ నాటికి ఇవన్నీ పని చేస్తాయి. స్వచ్ఛ రథాలు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నాం. రాష్ట్రంలోని 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు 12,371 గ్రామాలు ౼ాణఖీం కి చేరుకోగా, సెప్టెంబర్‌కి అన్ని గ్రామాలను ౼ాణఖీం గా చేస్తాం. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉండాలి. ప్రతి ఒక్కరూ వంటింటి వ్యర్థాలను కిచెన్ గార్డెన్ కు ఉపయోగించుకోవాలి. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. 13 నగరాలకు 71 స్వీపింగ్ యంత్రాలు సమకూర్చాం. మరో 14 యంత్రాలకు టెండర్లు పిలిచాం. 2028 నాటికి 6 ఝొర్వ్‌శీ జుఅవతీస్త్రం ప్రాజెక్టులు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. సర్క్యులర్ ఎకానమీలో ఇండస్ట్రియల్ పార్కులు తీసుకొస్తున్నాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీలు**

నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరుకు సంబంధించిన నివేదికలను వివరించారు. పనితీరు సరిగా లేని అధికారులను వివరణ అడిగారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధికారులకు సహకరిస్తామని, వారంతా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పరిశ్రమలు తక్కువగా వస్తున్నాయని, ఇక్కడ వ్యవసాయంపైన ఆధారపడే వారు ఎక్కువగా ఉండటమే అందుకు కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ప్రాంతంలో ఆక్వా కల్చర్ వల్ల రైతులకు కొంత వెసులుబాటు వచ్చింది. ఆక్వా వల్ల పొల్యూషన్ లేకుండా చర్యలు తీసుకుంటాం. కుళాయి ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందిస్తాం. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత. స్థానికంగా చిన్న కాశిరేవు వంతెన పునర్మిర్మాణం చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తాం. ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తాం. ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి చేస్తాం. కంసాలిపాలెం నుంచి మాధవ వరం వరకు వంతెన నిర్మాణం, ఎర్ర కాలువ గండ్లు పూడ్చివేతతో పాటు రహదారుల నిర్మాణం, టిడ్కో ఇళ్లు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామానాయుడు, కందుల దుర్గేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి సహా పలువురు ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు

# అడ్డుకోవటం జాతికి ద్రోహం

కానీ ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయని మండిపడ్డారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నామని, దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం అని చంద్రబాబు అన్నారు. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా ? అని ప్రశ్నించారు. నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికీ తీసుకెళతామన్నారు. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమేనని, దీనిపై పవన్ కల్యాణ్ తో మాట్లాడానని, ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా ? అని ప్రశ్నించారు. 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేకపోయారని చెప్పారు. 2023లో బిల్లు ప్రవేశపెట్టినా దీనిని అమలు చేసే నిబంధన పెట్టారని అన్నారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకువచ్చారనీ, కావాలనే కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయని తెలిపారు. దక్షిణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఏవేవో ఆరోపణలు చేసి సాకులు చెప్పారు.. లేని పోని సాకులతో బిల్లు వీగిపోయేలా చేయటం శోచనీయమన్నారు. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదు అని చెప్పారు. జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధవంతంగా పనిచేస్తున్నారు అని తెలిపారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు వచ్చిందన్నారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారని నిప్పులు చెరిగారు. ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలన్నారు. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం అని సిఎం చంద్రబాబు అన్నారు.

## రైతు భరోసా నిధులపై

# తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- **భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి**
- **రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు విడుదల**
- **మార్చి 22న తొలి విడత నిధులు సిద్దిపేట జిల్లాలో విడుదల చేసిన సీఎం**



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ. 5,653 కోట్ల నిధులను వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ క్రమంలో, రైతులు రెండో విడత రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

# అంబటి రాంబాబు నిరాహారదీక్ష..

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు నిరాహార దీక్ష చేపట్టారు. తన ఇల్లు, కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా, నిందితులను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో అంబటి నేడు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై, పోలీసు వ్యవస్థపై నిప్పులు చెరిగారు. "చంద్రబాబును దూషించాననే సాకుతో నన్ను అరెస్ట్ చేసి 18 రోజులు జైల్లో ఉంచారు.. మరి నా ఇంటిపై దాడి చేసి కార్లు, ఫర్నీచర్ ధ్వంసం చేసిన వారిని కనీసం 18 నిమిషాలైనా లోపల వేశారా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ దాడి అంతా పోలీసుల కళ్లముందే జరిగిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడి వెనుక నారా లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ల హస్తం ఉందని అంబటి ఆరోపించారు. గుంటూరులో ఇళ్లపై దాడులు చేసే సంస్కృతిని పెమ్మసాని తీసుకొచ్చారని విమర్శించారు. తనను అరెస్ట్ చేసిన సమయంలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో 'కస్టోడియల్ టార్చర్'కు గురిచేసే ప్రయత్నం జరిగిందని, ఆ గాయాలు ఇంకా మానలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "నన్ను భయపెట్టాలనుకోవడం మీ పొరపాటే.. ప్రాణాలకు తెగించైనా



న్యాయపోరాటం చేస్తాను. ఎవరినీ వదిలిపెట్టను" అని హెచ్చరించారు. ఈ దీక్షకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వైసీపీ నేతలు నూరి ఫాతిమా, డైమండ్ బాబు తదితరులు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

## కర్నూలు ఘోర ప్రమాదం

చెందగా, మరో ముగ్గురు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు.

శుక్రవారం జిల్లా కేంద్రంలోని కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో తేజశ్విని మృతి చెందగా, శనివారం కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆర్ శుభ/సుబ్బమ్మ (32) మృతి చెందినట్లు సమాచారం.

## పాత మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

దీనికోసం సోమవారం నాడు పార్లమెంటు నిర్వహించమనండి. అప్పుడు బిల్లును సభ ముందుకు తెస్తే.. అసలు మహిళా వ్యతిరేకులు ఎవరో తెలుస్తుంది. పాత మహిళా బిల్లును తెస్తే మేమందరం కచ్చితంగా ఓటు వేసి దానికి మద్దతు ఇస్తాము' అని అన్నారు.

## రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా ఎగురవేసి నల్లచట్టం ప్రతిని దహనం చేశాము. అప్పుడు నేను దహనం చేసిన ప్రతిల మంటను వ్యాపించనివ్వండి అని నేను అన్నాను. అదే నిన్న పార్లమెంటులో కూడా మంటలు చెలరేగాయి' అని స్టాలిన్ వీడియోలో అన్నారు. హిళా రిజర్వేషన్ల నెపంతో మోసపూరిత ప్రయతాన్ని ప్రతిఘటించిన తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలను ఆయన ప్రశంసించారు. అలాగే శుక్రవారం పార్లమెంటులో 50,60 వ దశకాల నాటి పాత డిఎంకెని చూడడం అంటే ఏమిటని అడుగున్న కొంతమంది అపరిపక్వ వ్యక్తులతో 'ఇదే డిఎంకె' చూడండి' అని నేను చెప్పాను. నిన్న మేమ దాన్ని బలంగా చూపించాం అని స్టాలిన్ వీడియో సందేశంలో అన్నారు. పార్లమెంటులో దీనిని ఓడించిన ప్రతి ఒక్కరికీ తాను కతృతజ్ఞతలు తెలిపారు. ఇండియా బ్లాక్ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏకతాటిపై నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. దేశాన్ని విభజించే ప్రయత్నాల కు ఇది భారీ దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న ఐక్యతను ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఆరంభం మాత్రమే. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 12 ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో వీగిపోయిందని ఆయన ఎత్తిచూపారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులకు ఈ సందర్భంగా స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.



# మచిలీపట్నం సమగ్ర అభివృద్ధే లక్ష్యం : మంత్రి కొల్లు రవీంద్ర





మచిలీపట్నం, (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా) బందరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృ ద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నం ఆర్ అండ్ బి (R&B) అతిథి గృ హంలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సంబం ధిత శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. నియోజకవ ర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కొరత లేకుండా చూసేందుకు తీసుకోవా ల్సిన చర్యలపై చర్చిం చారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే పనులపై ఒక పక్కా 'కార్యాచరణ ప్రణాళిక'ను (Action Plan) రూపొందించారు. నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురా వాలని దిశానిర్దేశం చేశారు.మంత్రి కొల్లు రవీంద్ర ఏమన్నారంటే.."మచిలీపట్నం రూపురేఖలు మార్చేందుకు మేము కట్టుబడి ఉన్నాం. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అధికారులు అలసత్వం వహించకుండా క్షేత్రస్థా యిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి." అధికారులకు స్పష్టమైన ఆదేశాలుసమీక్షా సమావేశంలో భాగంగా రోడ్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ వంటి కీలక అంశాలపై మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. నిధుల సమీకరణ కోసం ప్రభు త్వానికి పంపాల్సిన ప్రతిపాదనలను త్వరితగ తిన సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, మచిలీపట్నాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి స్వామి, మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, కోస్తా మురళీకృష్ణ, మున్సిపల్ సంబంధిత అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతే లక్ష్యం..సేవయే మార్గం

**మచిలీపట్నంలో జలధార - జలహారతి జిల్లా పరిషత్ సమీపంలో గల చెరువు వద్ద స్వయంగా శ్రమదానం చేసిన మంత్రి కొల్లు రవీంద్ర, చైర్మన్ కొనకళ్ళ మరియు కలెక్టర్ డీకే బాలాజీ**




మచిలీపట్నం (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర పిలుపులో భాగంగా మచిలీపట్నం నగరం పరిశుభ్రత బాట పట్టింది. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా, జిల్లా పరిషత్ సెంటర్ చెరువు వద్ద నిర్వహించిన జలధార – జలహారతి మరియు జలం - జీవం కార్యక్ర మాలు హోరెత్తాయి. రాష్ట్ర గనులు, భూగర్భ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మరియు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగి శ్రమదానం చేయడం విశేషం. శ్రమదా నంతో స్ఫూర్తినింపిన నేతలుమంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, మరియు కొనకళ్ళ నారాయణరావు కలిసి చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల ను, చెత్తాచెదారాన్ని స్వయంగా తొలగించారు. అధికారు



లకు, మున్సిపల్ సిబ్బంది కి కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, తామే స్వయంగా పారలు పట్టి పరిశుభ్రం చేస్తూ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.రూ. 75 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రంఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ సంచలన విషయాలు వెల్లడించారుగత ప్రభుత్వ నిర్లక్ష్యం గత ప్రభుత్వ పాలనలో మచిలీపట్నంలో లక్ష టన్నుల చెత్త పేరుకుపోయిందని, నగరం దుర్గంధంతో నిండిపోయిందని ఆయన విమర్శించారు. నగరం నుండి వచ్చే మురుగునీరు సముద్రంలో కలవకుండా, దానిని శుద్ధి చేసేందుకు రూ. 75 కోట్ల వ్యయంతో భారీ శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.స్థానిక చెరువు అభివృద్ధి కోసం రూ. 2.70 కోట్లు కేటాయించామని, అతి త్వరలోనే ఇది సుందరంగా తీర్చిదిద్దబడుతుందని తెలిపారు.సమష్టి కృషితోనే స్వచ్ఛాంధ్రఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మరియు కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, ప్రజారోగ్యం మెరుగుప డాలంటే పరిశుభ్రతను ఒక సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడు గుర్తించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా మచిలీపట్నం నగరాన్ని ఒక మోడల్ సిటీగా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ భారీ పారిశుధ్య యజ్ఞంలో పలువురు అధికారులు మరియు నేతలు భాగస్వాములయ్యారుకె. చంద్రశేఖర రావు, జిల్లా రెవెన్యూ అధికారి (DRO).కుంచె నాని, చైర్మన్, మచిలీపట్నం మార్కెట్ యార్డ్.లోగిశెట్టి స్వామి, టౌన్ పార్టీ అధ్యక్షులు.మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్.వీరితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కలెక్టర్ డీకే బాలాజీ తీసుకుంటున్న చొరవను మంత్రి మరియు స్థానిక నేతలు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. మంచి నీటి వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఇది కేవలం ఒక రోజుతో ముగిసేది కాదు, నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది అని రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర తెలిపారు.



## కేడీసీసీ బ్యాంక్‌కు అంతర్జాతీయ గుర్తింపు ISO 9001:2015 సర్టిఫికేషన్ కైవసం

**రాష్ట్రంలోనే మొదటి బ్యాంక్‌గా రికార్డు.. చైర్మన్ నెట్టెం రఘురాంకు సర్టిఫికేట్ అందజేత**



(ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా): కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (KDCC Bank) తన ప్రస్థానంలో మరో అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించింది. సేవల నాణ్యత, పారదర్శకత మరియు అత్యాధునిక బ్యాంకింగ్ ప్రమాణాలను పాటిస్తున్నందుకు గాను ఈ బ్యాంక్ ప్రతిష్టాత్మక ISO 9001:2015 గుర్తింపును పొం దింది. విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ఈ సర్టిఫికేషన్‌ను స్వీక రించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలుసర్టిఫికేట్ స్వీక రించిన అనంతరం నెట్టెం రఘురాం మాట్లాడుతూ.. ఈ గుర్తింపు బ్యాంక్ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిందని హర్షం వ్యక్తం చేశారు. "ISO 9001:2015 సాధించడం మా బ్యాంకుకు గర్వకారణం. ఇది కేవలం ఒక సర్టిఫికేట్ మాత్రమే కాదు, ఖాతాదారుల పట్ల మాకున్న బాధ్యతకు, మేము అందిస్తున్న పారదర్శక సేవలకు లభించిన ప్రపంచ స్థాయి ముద్ర," అని ఆయన పేర్కొన్నారు.డిజిటల్ విప్లవం - రైతుల సంక్షేమంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నామని రఘురాం తెలిపారు.డిజిటలైజేషన్ జిల్లాలోని అన్ని PACSలను డిజిటల్ వ్యవస్థలతో అనుసంధానం చేసి, UPI మరియు PhonePe వంటి ఆధునిక సేవలను రైతులకు చేరువ చేశాం.OTS పథకం: వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) ద్వారా వడ్డీ మాఫీ చేసి వేలాది మంది రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించాం.అగ్రగామిగా: ఆంధ్రప్రదేశ్‌లోని సహకార బ్యాంకుల్లోనే మొట్టమొదటిగా ISO సర్టిఫికేషన్ పొందిన ఘనతను KDCC బ్యాంక్ దక్కించుకోవడం విశేషం."రైతులు మరియు ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించడమే మా ప్రథమ ప్రాధాన్యత. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకింగ్ సేవలను మరింత వేగవంతం చేస్తాం."— నెట్టెం రఘురాం, చైర్మన్, KDCC బ్యాంక్ఈ కార్యక్రమంలో బ్యాంక్ CEO శ్రీ శ్యామనోహర్, ISO సంస్థ ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు పట్ల జిల్లా సహకార రంగ ప్రముఖులు మరియు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్సైజ్ శాఖపై మంత్రి కొల్లు రవీంద్ర కీలక సమీక్ష**

## అక్రమ మద్యంపై ఉక్కుపాదం



అమరావతి ప్రజాభూమి ప్రతినిధి
రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పనితీరు, ఆదాయ సమీకరణ మరియు ప్రజా ఆరోగ్య భద్రతపై మంత్రి కొల్లు రవీంద్ర ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా పరమైన సంస్కర ణలు మరియు కఠిన నిబంధనలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమైన ఆదేశాలు మరియు నిర్ణయాలునాణ్యతే ప్రామాణికం - రాండమ్ శాంప్లింగ్మద్యం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మంత్రి స్పష్టం చేశారు. డిపోలు మరియు దుకాణాల్లో రాండమ్ శాంప్లింగ్ నిర్వహించి, ల్యాబ్ పరీక్షల ద్వారా నాణ్యతను కఠినంగా నిర్ధారించాలని ఆదేశించారు.అక్రమ రవా ణాపై ఉక్కు పాదంకల్తీ మద్యం, పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే అక్రమ మద్యంపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మద్యం దుకాణాలు, బార్‌లు మరియు పర్మిట్ రూమ్‌లలో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.ఆదాయ వృద్ధి & నేర నియంత్ర ణరాష్ట్ర ఆదాయ వృద్ధిపై దృష్టి సారించడంతో పాటు, మద్యం వల్ల జరిగే నేరాలను నియంత్రించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.నూతన షాప్ పాలసీ రూపకల్పనరాబోయే సంవత్సరాలకు సంబంధించి పారదర్శకమైన, సమర్థవంతమైన నూతన షాప్ పాలసీ రూపొందించాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలను తదుపరి మంత్రుల బృందం (GoM) సమావేశంలో ప్రవేశపెట్టాలని ఆదేశించారు.త్వరితగతిన పెండింగ్ ఫైళ్ల పరిష్కారంశాఖలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రతిపాదనలను వెంటనే పరిష్కరించి, పాలనలో వేగం పెంచాలని మంత్రి సూచించారు.

## మనుషులకే కాదు.. మూగజీవాలకూ దాహార్తిని తీర్చుదాం

**మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ పిలుపు ఘనంగా సమితి 20 ఏళ్ల వార్షికోత్సవం .. చలివేంద్రం ప్రారంభం**



మచిలీపట్నం (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా)
ఎండలు మండిపోతున్న వేళ కేవలం మనుషులకే కాకుండా, మూగజీవాలైన పక్షులు, పశువులకు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ప్రాణాలను కాపాడాలని మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవా సమితి అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కోరారు. సమితి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం 15వ డివిజన్ నగరి చెన్నయ్య మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మరకాని పరబ్రహ్మంతో కలిసి ఆయన ప్రారంభించారు.రెండు దశాబ్దాల సేవా ప్రస్థానంఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా సమితి ఆధ్వర్యంలో వందలాది సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. చిలకలపూడి సెంటర్‌లో ఎనిమిది అడుగుల మదర్ తెరిసా విగ్రహాన్ని ప్రతిష్టించే భాగ్యం తమ సమితికి దక్కడం గర్వకారణమన్నారు. రక్తదాన శిబిరాలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు సాయం, పేద విద్యార్థులకు ఫీజులు, పుస్తకాల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా సమితి ప్రజల మన్ననలు పొందిందని వివరించారు. మరకాని ప్రశంస మరకాని పరబ్రహ్మం మాట్లాడుతూ.. ఎవరి వద్ద చందాలు ఆశించకుండా, సమితి సభ్యులు తమ సొంత నిధులతోనే 20 ఏళ్లుగా ప్రతి వేసవిలో మజ్జిగ, కూల్ డ్రింక్స్, మంచినీళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మదర్ తెరిసా స్ఫూర్తితో అధ్యక్ష, కార్యదర్శులు పైడిపాముల గురుప్రసాద్, కుమ్మరి జలచంద్రుడు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.నిరంతరాయంగా క్షేత్రస్థాయి సేవలు రాబోయే రోజుల్లో పేద ప్రజల కోసం మరిన్ని వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సమితి కార్యదర్శి జలచంద్రుడు తెలిపారు. సమితి అభివృద్ధికి పాటుపడిన 12 మందికి ఈ సందర్భంగా మెమెంటోలు అందజేసి, రిక్షా కార్మికులకు కండువాలు పంపిణీ చేశారు.20 ఏళ్ల ప్రస్థానం రెండు దశాబ్దాలుగా నిరంతరాయంగా సాగుతున్న చలివేంద్రాల నిర్వహణ.సేవకు నిలువుటద్దంగా చిలకలపూడిలో మదర్ తెరిసా విగ్రహ ప్రతిష్ట.క్షేత్రస్థాయిలో పేదవారికి అండగా మరిన్ని సేవా శిబిరాల ఏర్పాటుకు ప్రణాళిక.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు పైడిపాముల గురుప్రసాద్, సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగం తగ్గించడమే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర

**ప్లాస్టిక్ వినియోగం నిర్మూలం చేయడంతోనే భవిష్యత్ సాకారం కలుగుతుంది**




మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నంలో జిల్లా సర్వజన ఆసుపత్రిలో "స్వచ్ఛ్ ఆంధ్ర – స్వర్ణాంధ్ర" కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ,ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేష స్పందన వచ్చింది.ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది కలిసి ఆసుపత్రి పరిసరాలు రోగులు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రదే శాలను శుభ్రపరిచారు. చెత్తను తొలగించడం మాత్రమే కాకుండా, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి, పరిశు భ్ర త పాటించాలి అనే సందేశాన్ని ప్రజలకు వివరించారు. అలాగే, ప్రజల్లో పరిశుభ్రతపై అవగా హన కల్పించేందుకు ఆసుపత్రి వెలుపల ర్యాలీలు నిర్వహించి, నినాదాలతో సందేశాలు ఇచ్చారు. "పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం" అనే భావనను ప్రతి ఒక్కరికీ చాటి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడమే కాకుండా, ప్రజల్లో కూడా శుభ్రతపై చైతన్యం పెరిగిందని ఆసుపత్రి సూపర్డెంట్ తెలిపారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపర్డెంట్ శ్రీనివాస్, నాయక్ ,ఆర్ ఎం ఓ నిరంజన్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## టేకు గాంధీ గారి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఉప్పాల రాము



ప్రజాభూమి పెడన
పెడన టౌన్ 10వ వార్డ్ రాజీవ్ నగర్ కాలనీ వాస్తవ్యులు పెడన మాజీ కౌన్సిలర్ బైలపాటి జ్యోతి తండ్రి టేకు గాంధీ మరణించగా వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉప్పాల రాము నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుతున్న మైత్రి ఫౌండేషన్ సేవలు

**క్యాన్సర్ బాధితుడికి అండగా నిలిచిన మచిలీపట్నం 'మైత్రి ఫౌండేషన్**



ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:
స్థానిక చింతకుంటపాలెం (జమ్మలమడుగు స్ట్రీట్) లో నివాసం ఉంటున్న నిరుపేద చేనేత కార్మికుడు (నాసిక వెంకటేశ్వరరావు.) కి మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ బాసటగా నిలిచింది. గత కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనకు, ఒక నెలకు సరిపడా మందుల ఖర్చు నిమి త్తం ₹8,000/- ఆర్థిక సాయాన్ని శనివారం మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు.ప్రస్తుతం విజయవాడలోని నాగార్జున క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు. కి ఆరో గ్యశ్రీ ద్వారా వైద్యం అందుతున్నప్పటికీ, మందుల కోసం ప్రతి వారం సుమారు ₹2,000/- ఖర్చు వుతోంది. కేవలం ప్రభుత్వ పెన్షన్‌పైనే ఆధారపడి బతుకుతున్న ఆ కుటుంబ పరిస్థితిని గమనించిన మైత్రి ఫౌండేషన్, తక్షణ సాయంగా ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో వారి నివాసానికి వెళ్లి అంద జేశారు. కష్టాల్లో ఉన్న పేదలకు తోడుగా నిలవడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా అధ్యక్షుడు వేణు కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు కుమార్, కార్యదర్శి రాధాకృష్ణ, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్,మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## వీఓఏలు ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలి

**-ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
**-37మంది వీఓఏలకు నూతన మొబైల్ ఫోన్ల పంపిణీ**



అవనిగడ్డ / చల్లపల్లి ప్రజాభూమి ప్రతినిధి
వీఓఏలు ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం చల్లప ల్లిలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని 37మంది వీఓఏలకు నూతన మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేసి ఫోన్లు అందచేశారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్వాక్రా రుణాలతో పేదల జీవనోపాధి మార్గాలు మెరుగుపడేందు కు వీఓఏలు మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీ పీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ ఏఏ ఆనందకుమారి, ఏపీఎస్ ఐడీసీ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకు మారి, స్వచ్ఛ ఏపీ డైరెక్టర్ బోలెం నాగమణి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, టీ.ఎన్.టీ.యూ.సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి చంద్రశేఖర్ (చిట్టి), పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, ఏపీఎం కారుమూరి శ్రీనివాసరావు, సీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం

**-ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**
**-నాదెళ్లవారిపాలెం, రాముడుపాలెం రోడ్ల నాణ్యత పరిశీలించిన ఎమ్మెల్యే**





అవనిగడ్డ / చల్లపల్లి ప్రజాభూమి ప్రతినిధి
నాణ్యతా ప్రమాణాలతో గ్రామీణ ప్రధాన రహదారులను నిర్మిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం చల్లపల్లి మండలం నడకుదురు పంచాయతీ పరిధిలో రూ.49 లక్షలతో నూతనంగా నిర్మించిన నాదెళ్లవారిపాలెం ప్రధాన రహదారి, రూ.49 లక్ష ల తో నూత నంగా నిర్మించిన రాముడుపాలెం గ్రామ ప్రధాన రహదారులను ఎమ్మెల్యే పరిశీలించారు. పంచాయ తీ రాజ్ అధికారులతో కలిసి రహదారుల నిర్మాణ నాణ్యతను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశా లతో నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల నరసయ్య, గోపీచంద్, భాస్కరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి మీడియేషన్ రాజమార్గం

**సమయం, ధనం ఆదా.. కోర్టులకూ ఊరట**
**కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జ్ జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు పిలుపు**






మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి)
నిత్యం పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, కక్షిదారులకు త్వరిత గతిన న్యాయం అందించడంలో మీడియేషన్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జ్ జిల్లా జడ్జి మరియు పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదనంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, మీడియేటర్లు మరి యు కక్షిదారులతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిం చారు. న్యాయవాదుల సహకారం కీలకం మీడియేషన్ ద్వారా కేసులు పరిష్కారం కావాలంటే న్యాయవాదుల పూర్తి స్థాయి సహకారం అవసరమని జడ్జి గారు స్పష్టం చేశారు. దీనివల్ల ఉభయ పార్టీలకు సమయం, డబ్బు ఆదా కావడమే కాకుండా, కోర్టులపై పని ఒత్తిడి తగ్గుతుందని వివరిం చారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు మారుతున్న కాలానుగుణంగా మీడియేషన్ ప్రాముఖ్యత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెరిగిందని ఆయన గుర్తు చేశారు.కమర్షియల్ కేసులకు ముందస్తు పరిష్కారం కమర్షియల్ యాక్ట్ ప్రకారం దాఖలు చేసే కేసులన్నీ ముందస్తుగా ప్రీ-మీడియేషన్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ ఒక చక్కని వేదిక. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.గాజుల వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ జిల్లా జడ్జి.జిల్లాలో 2000 కేసుల పరిష్కారంజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రామకృష్ణయ్య మాట్లాడుతూ, కృష్ణా జిల్లా వ్యాప్తంగా (విజయవాడతో కలిపి) 98 మంది శిక్షణ పొందిన మీడియేటర్లు అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. వీరి ద్వారా ఇప్పటివరకు సుమారు 2000 కేసులు విజయవంతంగా పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. సుప్రీం కోర్టు, హైకోర్టులు సైతం మీడియేషన్ ప్రక్రియకు పెద్దపీట వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్. యుగంధర్, తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎస్. సుజాత, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, సీనియర్ న్యాయవాదులు గరిమెళ్ళ ప్రభాకర్ రావు, గంజి నాగేంద్రరావు తదితరులు మీడియేషన్ విశిష్టతపై ప్రసంగించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి శయన సుధాకర్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి




ఆదివారం 19, ఏప్రిల్ 2026

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర విజయానికి ప్రజల అవగాహనే మూలం



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

ప్రజల్లో అవగాహన పెంపుతోనే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతమవుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. 230 కోట్ల రూపాయలతో పైపులైన్ ద్వారా గోదావరి జలాలను నగర ప్రజలకు అందించే ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 50వ డివిజన్‌లో జరిగిన జలధార–జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు.నీటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం అవసరమని, ప్రస్తుతం నగరంలో రెండు పూటల నీటి సరఫరా అందిస్తున్నామని తెలిపారు.మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ పరిశుభ్రత, నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నగర కమిషనర్ భాను ప్రతాప్ సహా పలువురు అధికారులు పలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెదపాడు గ్రంథాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం.



ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు

పెదపాడు శాఖా గ్రంథాలయం నందు స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో నిర్వహించారు. గ్రంథాలయ పరిసర ప్రాంతాలు శుభ్రం చేసి, గ్రంథాలయంలోని ఉన్న పుస్తకాలు శుభ్రపరిచారు. విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులతో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.విద్యార్థిని విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్చే నీటి సంరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి, జలం–జీవం అంశంపై విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు,సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొనిన విద్యార్థిని, విద్యార్థులకు స్నాక్స్ అందించారు. పెదపాడు గ్రంథాల అధికారి దుగ్గిపోగు జానుబాబు పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

## ప్రభుత్వ బడిలో పిల్లల్ని చేర్పిద్దాం

–ఊరి బడిని కాపాడుకుందాం.

ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరు జిల్లా పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని కన్నారావు మాజీ సర్పంచ్ జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వసంతవాడ గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అంగన్వాడి వర్కర్స్ ఆశా వర్కర్స్ మానవతాస్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు యుటిఎఫ్ జిల్లా మండల కమిటీ నాయకులు కార్యకర్తలు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి బడి ఈడు గల పిల్లలను కాన్వెంట్ కి వెళుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను ఇక్కడ అందించుచున్న విద్య యొక్క నాణ్యతను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవికుమార్, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు పులవర్తి శ్రీనివాస్ రావ, సబ్బాని వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ పెదపాడు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, రవికుమార్ యుటిఎఫ్ మండల కమిటీ నాయకులు, గ్రామ పరిధిలోని హై స్కూల్ ఎలిమెంటరీ పాఠశాలల సిబ్బంది మానవతా సంస్థ ప్రతినిధి ఉమామహేశ్వర రావు తల్లిదండ్రులు అంగన్వాడీ వర్కర్స్ ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## గడ్డమనుగు నియామకం పట్ల హర్షం



ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు

ద్వారకాతిరుమల ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యునిగా జనసేన కార్యదర్శి గడ్డంమడుగు రవికుమార్ నియామకం పట్ల వేలేరుపాడు జనసేన మండలాధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శిగా ఎన్నో సేవలు అందించిన రవికుమార్ కు మంచి గుర్తింపు ఈ విధంగా లభించిందన్నారు. దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా ప్రజలకు మరిన్ని సేవలు అందించి మున్ముందు మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఈ సందర్భంగా ఆదినారాయణ కోరారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో గడ్డ మనుగుకి పుష్ప గుచ్చా లతోఅభినందనలు తెలియపరిచారు.

## భూగర్భ జలాలను పెంచి భావితరాలకు నీటికొరత లేకుండా సమిష్టిగా కృషిచేద్దాము.

- జలధార–జలహారతి కార్యక్రమంలో ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలి.
- పార చేతబట్టి మట్టిపూడికను తీసి, మట్టితట్టలను స్వయంగా ఉపాధిహామీ శ్రామికులకు అందించి అందరికీ జోష్ నింపిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



ప్రజాభూమి ప్రతినిధి–దెందులూరు

దెందులూరు మండలం గాలాయిగూడెం గ్రామంలో శనివారం జలధార–జలహారతి కార్యక్రమంలో భాగంగా రూ 4 లక్షలు 21 వేల రూపాయలు వ్యయంతో బాబుగారు చెరువు నుండి వెంకయ్యపుంత వరకు ఒక కిలోమీటరు ఫీడర్ ఛానల్ తవ్వకాలు పనులను పరిశీలించి, పారచేతబట్టి మట్టిపూడికను తీసి, మట్టితట్టలను స్వయంగా ఉపాధిహామీ శ్రామికులకు అందజేస్తూ, సుమారు 90 నిమిషాలు జలధార – జలహారతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు, రైతులకు, ఉపాధి హామీ శ్రామికులకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి జోష్ నింపారు. జాతీయ ఉపాధిహామీ శ్రామికులతో జిల్లా కలెక్టరు సమేకమయ్యి, రోజుకి రూ 307 రూపాయలు తగ్గకుండా పనిచేసుకోవాలని, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరితో కలిసి గ్రూపు ఫోటో దిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భజలాలను పెంచడం, నీటి భద్రతను బలోపేతం చేయడం మరియు ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార–జలహారతి కార్యక్రమం అన్నారు. 100 రోజులు యాక్షన్ ప్లాన్ ద్వారా ఉపాధి హామీ నిధులను అనుసంధానిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పైప్డ్ వాటర్ సప్లైపై దృష్టి సారిస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు మట్టాన్ని పెంచడం మరియు గ్రామాలలో పైపులు ద్వారా సురక్షిత తాగునీరు అందించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. యాక్షన్ ప్లాన్ అమలు, దీనిలో భాగంగా చెరువులు, చెక్ డ్యాంలు మరమ్మతులు, వర్షపునీటి నిల్వలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. దీనికి ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ కార్యక్రమాన్ని అనుసంధానించామని, దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్ళాలని అన్నారు. జలవనరులు సంరక్షణతో పాటు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించడం దీని ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జలవనరులను పెంచి, భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. జిల్లాలో జలధార కార్యక్రమం కింద నీటిపరిరక్షణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచెయ్యాలని అన్నారు. మండల, గ్రామాలు వారీగా చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు ఫీడర్ చానెల్స్, చెరువులు చేపట్టవలసిన పనులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని, నిర్దేశించిన సమయంలోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతకు నాణ్యతా బృందాలతో తనిఖీలు నిర్వహించటం జరుగుతుందని, నాణ్యతలో లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధిహామీ శ్రామికులకు చల్లటి రక్షిత మంచినీటిని, భోజన సమయంలో నీడనిచ్చే పందిర్లు, అన్నిరకాలు మందులతో మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ తో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దారు బి.సుమతి, యంపిడివో కె.వీరప్రతాప్, ఏపీవో పి.ఫాతిమా ప్రసన్న, ఇంజనీరింగు కన్సల్టెంటు జి.దుర్గాప్రసాదు, ఫీల్డు, డిజిటల్, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, జాతీయ ఉపాధి హామీ శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు మట్టములను ఎప్పటికప్పుడు అంచనాలు వేసి, పెంపుపై క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలి

- లీకేజీలు నివారణ, ఇంకుడు గుంతలు – నీటి సంరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచెయ్యాలి.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ప్రజా భూమి ప్రతినిధి–పెదవేగి



పెదవేగి మండలం ముండూరు గ్రామంలో శనివారం రెండు ఫిజియో మీటర్లు నుండి టెలిమీటరు ద్వారా భూగర్భజలాలు మట్టములను స్వయంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భజలాలు స్థాయిని శాస్త్రీయంగా మట్టములను అంచనాను స్వయంగా పరిశీలించామని తెలిపారు. భూగర్భజలాలు స్థాయి నిరంతరం తగ్గిపోతున్న నేపథ్యంలో వాటిని కాపాడుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. జిల్లాలో 72 పిజోమీటర్ల నుండి టెలిమీటర్ల ద్వారా భూగర్భ జలమట్టాన్ని ఎప్పటికప్పుడు కొలవడం జరుగుతుందని, మార్చి నెలలో జిల్లాలో సగటున నీటిమట్టం 21.23 మీటర్లు ఉందని అన్నారు. ఈ రోజున ముండూరు గ్రామంలో కొలిచినపుడు 23.38 మీటర్లు ఉందని తెలిపారు. వర్షాకాలం తర్వాత 3 మీటర్లు, ఎండాకాలం 8 మీ లోతులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈరోజున 100 రోజులు జలధార –జలహారతి కార్యక్రమం చేపట్టి వాననీటి సంరక్షణ చర్యలు వేగవంతం చేసిందని తెలిపారు. జలమట్టాన్ని క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా భవిషత్తు నీటినిర్వహణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పిజియోమీటర్లను నిరంతరం పర్యవేక్షించాలని, సేకరించిన డేటా అనుగుణంగా భూగర్భజలాలు స్థాయిని పెంచుటకు చర్యలు చేపట్టాలని, ఇందుకు నిధులు కొరతలేదని స్పష్టం చేశారు. అలాగే ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రౌండు వాటరు డిడి పైలా కోదండరామ్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో విషాదం గుండెపోటుతో వ్యక్తి మృతి



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న మెర్ల సత్యనారాయణ అనే శ్రామికుడు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందాడు. పి. సత్యనారాయణ రాజు సావిడి నుంచి ర్యాలి దుర్గమ్మ గుడి వరకు జరుగుతున్న పనుల్లో ఉండగా ఆయన అస్వస్థతకు గురై కుప్పకూలాడు. ఎంపిడిఓ ఆదేశాల మేరకు సిబ్బంది వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు సిహెచ్. విజయరెడ్డి (ఏపీఓ/ ఈసీ) తదితరులు స్థలాన్ని పరిశీలించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## బడుగువానిలంకలో రూ.63.80 కోట్ల గ్రోయన్ల నిర్మాణానికి భూమి పూజ

- గ్రోయిన్ల నిర్మాణంతో నది కోతకు అడ్డుకట్ట.
- ఏమాత్రం రాజీలేని నాణ్యతతో కూడిన పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో గౌతమీ నదిలో రూ.63.80 కోట్ల వ్యయంతో నాలుగు గ్రోయన్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ తో కలిసి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నదీ కోతను అరికట్టడం, రైతుల భూములను రక్షించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. రిలయన్స్ పైప్‌లైన్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి వరదల ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా, పైప్‌లైన్ భద్రతను కూడా పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. గతంలో నిర్మించిన గట్లు నాణ్యత లోపాల కారణంగా వరదలకు తట్టుకోలేకపోయాయని, ఈసారి మాత్రం ఎలాంటి రాజీ లేకుండా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఐఐటీ మద్రాస్ నిపుణుల చేత గ్రోయన్ల డిజైన్లను పరిశీలింపజేసినట్లు తెలిపారు. తాళ్లరేవు నుంచి గుజరాత్ వరకు వెళ్లే గ్యాస్ పైప్‌లైన్ భద్రత దృష్ట్యా ఈ పనులు అత్యవసరమని, వరదల సమయంలో పైప్‌లైన్ దెబ్బతింటే గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని పేర్కొన్నారు. బడుగువానిలంక రైతులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న నదీకోత సమస్యకు ఈ గ్రోయన్ల నిర్మాణం శాశ్వత పరిష్కారం కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ కార్యక్రమంలో నీటి సంరక్షణపై అవగాహన

### సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం "ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట



ఆత్రేయపురం మండలం, కట్టుంగ గ్రామంలో ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే "స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ" కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, నీరు భవిష్యత్ తరాలకు అత్యంత విలువైన వనరని, దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని వివరించారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెరువులు, కాలువలను శుభ్రంగా ఉంచడం, నీటి వనరులను కలుషితం కాకుండా కాపాడడం అత్యవసరమని సూచించారు. వాడిన నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం ద్వారా నీటి వృథాను తగ్గించవచ్చని చెప్పారు. గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ ద్వారా ఇంటి పనులలో ఉపయోగించిన నీటిని తోటలు, మొక్కలకు వినియోగించుకోవచ్చని వివరించారు. అలాగే సోక్ పిట్స్ ఏర్పాటు ద్వారా మురుగు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నీటి సంరక్షణలో తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కట్టుంగ త్రినాధరావు, పంచాయితీ కార్యదర్శి యు. చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. ప్రవీణ్, గ్రామ సచివాల య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణ ఆంధ్ర సాకారం: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి.

- కొత్తూరులో ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం.
- స్వయంగా చెత్త సేకరించి, శ్రమదానం చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.
- 23 చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించి గ్రామాలకు పంపిణీ.
- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి, భారీ ర్యాలీ, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ.

ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు

పరిశుభ్రమైన గ్రామాలను నిర్మించుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించగలమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా, శనివారం పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ దెందులూరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శ్రమదానం – చెత్త సేకరణ

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా కొత్తూరు గ్రామ వీధుల్లో పర్యటించి చెత్తను సేకరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. ఎమ్మెల్యే స్వయంగా పారిశుధ్య పనుల్లో పాల్గొనడం గ్రామస్తులలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

### వాహనాల పంపిణీ – పారిశుధ్య సిబ్బందికి సూచనలు

గ్రామాల్లో చెత్త సేకరణను మరింత బలోపేతం చేసేందుకు, ఎమ్మెల్యే 23 నూతన చెత్త సేకరణ వాహనాలను జెండా ఊపి ప్రారంభించి వివిధ గ్రామాలకు పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడా బహిరంగ చెత్త కుప్పలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్త సేకరణ సమయంలోనే తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. "స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు."ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు , సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మహిళా బిల్లును అడ్డుకోవటం ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే

- రిజర్వేషన్ బిల్లు అడ్డుకుని జాతికి ద్రోహం చేశారు
- మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి
- నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు






ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు జాతికి ప్రత్యేకించి మహిళలకు ద్రోహం, అన్యాయం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ బిల్లును అడ్డుకున్నందుకు నిరసనగా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలతో కలిసి సీఎం ఈ నిరసన ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకుని నడిచారు. మహిళా బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మహిళా ద్రోహులని పేర్కొన్నారు. మహిళా సమాజానికి ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల్ని ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సీఎం అన్నారు. మూడు దశాబ్దాల మహిళా రిజర్వేషన్ కలను ప్రతిపక్ష పార్టీలు చెరిపేశాయని పేర్కొన్న ముఖ్యమంత్రి మహిళా రిజర్వేష న్ బిల్లును అడ్డుకోవటం మహిళలకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్డీఏ పక్షాలతో కలిసి నిరసన ర్యాలీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ..” భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఓ బ్లాక్ డే. మహిళల కు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని సుదీర్ఘ కల సాకారం అవుతుందని భావించాం. పార్ల మెంటు, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నాం. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతిలో భాగం. నిన్న పార్లమెంటులో దీని కి భిన్నంగా జరిగింది. విపక్షాల వైఖరికి నిడద వోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించాం. మహిళలంతా బయటకు వచ్చి వారికి నిరసన తెలియాలని పిలుపు ఇస్తున్నాను. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోం మంత్రి పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెప్పారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయి. ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయి. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నాం. దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా.?” అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

**విద్రోహంపై ఇంటింటికీ ప్రచారం**

“నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్తాం. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమే. దీనిపై పవన్ కల్యాణ్‌తో మాట్లాడాను. ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలి. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా? 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించాం. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేక పోయారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకు వచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయి. దక్షిణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఏవేవో ఆరోపణలు సాకులు చెప్పారు. లేని పోని సాకులతో బిల్లును డిఫీట్ చేయటం శోచనీయం. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదు. జనాభాలో సగం ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధంగా పనిచేస్తున్నారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు తీసుకువచ్చారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారు. ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయి.? ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలి. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం”. అని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ పక్షాలు నిర్వహించిన నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరిని కలిసిన ఎంపీ హరీష్ బాలయోగి...



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

ఢిల్లీ లోని మంత్రి కార్యాలయంలో కేంద్ర విద్యాశాఖ సహాయ, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక శాఖ మంత్రి జయంత్ చౌదరి ని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమలాపురం పార్లమెంట్ పరిధిలోని యువతకు విద్యా మరియు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి జయంత్ హామీ ఇచ్చినట్లు ఎంపీ హరీష్ తెలిపారు.

# శ్రీవారి సన్నిధిలో భక్తి పూర్వక తులాభారం..

### మొక్కు తీర్చుకున్న బండారు దంపతులు.. రూ. 21 వేల నగదు సమర్పణ..

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం



అమలాపురం పట్టణంలో వెలిసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివా రం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన తులాభా రం కార్యక్రమం భక్తుల జయ జయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. అమలాపురం పట్టణా నికి చెందిన ప్రముఖ హైడ్రాలిక్ రంగ నిపుణులు బండారు సత్యనారా యణ,శ్రీదేవి దంపతులు తమ మొక్కును తీర్చు కునేందుకు ఈ తులా భార సేవను నిర్వహిం చారు. అంతర్జాతీయ స్థాయిలో,ముఖ్యంగా దక్షిణ ఆసియా దేశాల్లో విశేష సేవలు అంది స్తున్న సత్యనారాయ ణకు ఇటీవల వృత్తి పరంగా పదోన్నతి (ప్రమోషన్)లభించింది. తమ కోరిక నెరవేరిన తరుణంలో శ్రీవారిపై ఉన్న అపారమైన నమ్మకంతో వారు ఈ మొక్కును చెల్లించుకున్నారు.ఆలయ ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం, అర్చక స్వాము ల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం సాగింది.తన బరువుకు తూగే విధంగా దంపతులు రూ. 21,116/- (ఇరవై ఒక్క వేల నూట పదహారు రూపాయలు) నగదును స్వామివారికి తులాభారంగా సమర్పించారు. స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు దంపతుల కు ఆశీర్వచనాలు అందించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. శ్రీదేవి,మాట్లాడుతూ మా పట్ల స్వామివారు చూపిన కరుణకు కృతజ్ఞతగా ఈ మొక్కు తీర్చుకున్నాము. అందరికీ ఆయురా రోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆ శ్రీనివా సుడిని ప్రార్థించినట్టు బండారు శ్రీదేవి తెలిపారు.ఆధ్యాత్మిక శోభతో ఆలయ ప్రాంగణం తులాభారం వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనసందోహమైంది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసిన ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు), కార్యనిర్వా హక అధికారి సత్య కుమార్ లకు బండారు దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ

కాకినాడ జిల్లాలో ఇంటి దొంగతనాలు, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 10 కేసులను ఛేదించి 25.3 లక్షల విలువైన 117 గ్రాముల బంగారు, 629 గ్రాములు వెండి ఆభరణాలు, 1,95,000/- నగదు డ 5 లక్షల విలువైన 6 మోటార్ సైకిల్స్ రికవరీ చేశారు. జిల్లా ఎస్పీ జి. బింధు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఏ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఐపిఎస్ పర్యవేక్షణలో, పెద్దాపురం ఇంచార్జ్ డిఎస్పి కేవీవీ సత్యనారాయణ నేతృత్వంలో ఇంటి నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్, ఇద్దరు జజూలను అదుపులోకి తీసుకున్నారు. ఇంటి నేరాలకు పాల్పడుతున్న ఒక ముద్దాయి అరెస్ట్ చేసి మరియు ఇద్దరు జజూ లను అదుపులోకి తీసుకున్నారు.అలాగేమోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్ చేశారు..కాకినాడ జిల్లాలో కాకినాడ టౌన్, కాకినాడ టౌన్, కాకినాడ రూరల్ కోరింగ, సామర్లకోట పోలీసు స్టేషన్ లలో ప్రాంతాలలో జరిగిన 10 కేసులను చేదించి ఐదుగురు ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగింది. ఏటి మొగ కు చెందిన రేకాడి



వెంకటేశ్వర్లు,మరియు ఇద్దరు జజూ లను అదుపులోకి తీసుకున్నారు.

మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముద్దాయిలు అయిన వనమాడి జానకిరామ్ జె. రామారావు పేట,రేఖా సతీష్ , సత్యవరం గ్రామం , వడ్డాది , మాడుగుల మండలం . తోట శివ శంకర్ , గాటి సెంటర్, కాకినాడ అదుపులోకి తీసుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఇంటి నుండి బయటకు వెళ్ళినపుడు తాళాలు బయటకు కనబడేలా వేసి ఉంచవద్దన్నారు.ఇంటి తాళాలను కిటికీల వద్ద , షూ స్టాండ్ లలో దాచి ఉంచవద్దన్నారు. ఇళ్ళకు ఇన్నర్ లాకింగ్ సిస్టం పెట్టుకోవలన్నారు..ఉచిత పోలీసు సర్వీసును ఉపయోగించుకుని నేరాలు జరగకుండా చూసుకోవాలని తెలియజేశారు. విలువైన వస్తువులను లాకర్ లలో భద్రపరుచుకోవడం ఉత్తమమన్నారు. అవకాశం ఉన్నంత వరకు సీసీ కెమెరాలను ఏర్పరుచుకోవడం చాలా ఉత్తమన్నారు.ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పై ముద్దాయిలను పట్టుకొని రికవరీ చేయడంలో ప్రత్యేక కృషి చేసిన కాకినాడ జిల్లా సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ దేవరాజ్ మనిష్ పాటిల్,, ఎస్ బి డిఎస్పీ కేవీవీ సత్యనారాయణ, కాకినాడ సీసీఎస్ ఇన్స్పెక్టర్ వి. కృష్ణ, కాకినాడ రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ చైతన్య, కాకినాడ వన్ టౌన్ సి ఐ నాగాదుర్గారావు , కాకినాడ టూటౌన్ సి ఐ ఎం అప్పల నాయుడు, సామర్లకోట సి ఐ ఎ.కృష్ణ భగవాన్ , కోరింగ ఎస్ ఐ సత్యనారాయణ, కాకినాడ వన్ టౌన్ ఎస్ ఐ స్వామి నాయుడు, కాకినాడ టూటౌన్ ఎస్ ఐ పి బుజ్జిబాబు, మరియు క్రైమ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

-స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో మంత్రి తండ్రి సత్యం





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగంగా, పరిశుభ్రతతో పాటు జలవనరుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి సుభాష్ తండ్రి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తెలిపారు. శనివారం స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ నీటి సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలధార - జలహారతి థీమ్‌తో నీటి సంరక్షణపై దృష్టి సారిస్తూ వర్షపు నీటిని నిల్వ చేసి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. నీటి కాలుష్యం కారణంగా క్యాన్సర్, కిడ్నీ, లివర్ వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొంటూ వాటి నివారణకు చర్యలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు మాట్లాడుతూ జల సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, అధికారులు, హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలు చల్లడంతో భూసారం పెరుగుతుంది

పచ్చిరొట్ట ఎరువులు సాగును ప్రోత్సహించండి.

జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

భూమిని అధిక సూర్య రష్మి (ఎండల) నుండి రక్షించేందుకు రైతులు పచ్చిరొట్ట సాగును ప్రోత్సహించాలని కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారంకాజలూరు మండలం జగన్నాథగిరి,కాజలూరు గ్రామాల్లో విజయ్ కుమార్ పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఈ సంవత్సరం “ఎల్ నినో” ప్రభావం వలన వర్షపాతం తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతాంగం సమాయత్తం కావాలని సూచించారు. భూమిని ఎండ నుండి రక్షించే విధంగా ‘పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చి రొట్ట విత్తనాలను చల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని, ఉష్ణోగ్రత తగ్గి తేమ శాతం పెరుగుతుందని వివరించారు. దీనివల్ల రైతులకు ఎరువుల ఖర్చు తగ్గి అదనపు ఆదాయం కలుగుతుందని తెలిపారు. పీ.ఎం.డీ.ఎస్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయ సంస్థ ద్వారా అందిస్తున్న 32 రకాల విత్తనాల కిట్లను రైతులు వినియోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని కోరారు.అలాగే, దాల్వా పంట కోతలు మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో, రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరప సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాబురావు, మండల వ్యవసాయ అధికారి వి. అశోక్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్ వర్మ, ప్రశాంత్, వ్యవసాయ సహాయకులు తులసిరామ్, సత్య, సాహిత్య, సౌమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

జలవనరుల సంరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి.

ఆలమూరులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

పర్యావరణాన్ని పరిరక్షించాలంటే జలవనరులను కాపాడుకోవాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి ఆలమూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికంగా చెరువు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. చెత్త ఇస్తే సరుకులు ఇచ్చే స్వచ్ఛ రథాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, జలవనరుల సంరక్షణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా జలధార పేరుతో నీటి భద్రత-- సాగునీటి సంఘాల బాధ్యత అంటూ ప్రభుత్వం జలవనరుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అంశంలో భాగస్వాములు కావాలన్నారు.

## జనసేన ఇంచార్జ్ బండారు ఆధ్వర్యంలో రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు కొత్తపేటలో ఘన సత్కారం జరిగింది. జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆయన నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంతో పాటు ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెడ్డి అనంత కుమారిని దుశ్శాలువాలతో సత్కరించి, మొక్కలను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ, సుబ్రహ్మణ్యం నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ప్రజాసేవకు గుర్తింపుగానే ఈ పదవి లభించిందని పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్‌లు ఆయన సేవలను గుర్తించి గౌరవించారని అన్నారు. ఇది వ్యక్తిగత గౌరవమే కాకుండా కొత్తపేట నియోజకవర్గానికి గర్వకారణమని తెలిపారు. అలాగే అనంత కుమారి బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆమె నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ--జనసేన-బీజేపీ కూటమి సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా..



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమ లాపురంలో వికాస స్కిల్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మరియు కూటమి ప్రభుత్వం లో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సాధ్యంలో అన్నిచోట్ల నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తు న్నామని 17 కంపెనీల హెచ్ఆర్ లతో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూ నిర్వహించి 200మందికి కంపెనీ లెటర్స్ అందించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో జరిగే జాబ్ మేళాలను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కెవిఆర్ .నరసింహారావు ప్రిన్సిపల్ కే.మనోహర్, చైర్మన్.మల్లిపూడి విజయలక్ష్మి ,కరాటం ప్రవీణ్. ప్లేస్మెంట్ అధికారులు వై. వర ప్రసాద్ బి .శ్రీనివాస్ సిహెచ్. జాన్ పాల్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజేంద్ర ప్రసాద్. హరి సమ్మోను, ఎం.డి.కె. శ్రవణ్ దిలీప్,డాక్టర్ కె. హేమవిజిత తధితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులని అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రత - జలసంరక్షణపై డిపో మేనేజర్ భాస్కరరావు ప్రతిజ్ఞ.

-వివిధ రకాల మొక్కలు నాటిన సిబ్బంది

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పేపకాయల భాస్కరరావు ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగంగా, పరిశుభ్రతతో పాటు జలవనరుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ఉండాలని భాస్కరరావు సిబ్బందిని ఉద్దేశించి ప్రతి నీటి చుక్క ముందు తరాని కి ఉపయోగంగా ఉండాలని తెలియజేశారు. ఈసందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేసి వివిధ రకాల మొక్కలు నాటించారు . ఈ సందర్భంగా స్వచ్ఛంద ప్రతిజ్ఞ చేయించి ప్రతి నీటి బొట్టును ఆదాసేస్తూ జలవనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఆఫీస్ సిబ్బంది గ్యారేజ్ సిబ్బంది , కార్మికులు తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు . ఇలాంటి కార్యక్రమం సమాజానికి ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుందని భాస్కరరావు తెలిపారు.

# గ్రామాల్లో నీటి నిల్వలు పెంచాలి : జలధారలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### - : పెద్దవడుగురు మండలంలో విస్తృతంగా పర్యటించి.. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, జలధార - జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

పెద్దవడుగురు మండల కేంద్రంలో ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించగా, ఇందులో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆరె కటిక వెల్ఫేర్ చైర్మన్ హరికృష్ణరావు, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, తదితరులు పాల్గొన్నారు. ఈనెల జలధార – జలహారతి థీమ్ తో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా ముందుగా మండల కేంద్రంలోని సచివాలయం వద్ద వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పెద్దవంక వద్ద జలధార – జలహారతి కార్యమాన్ని భూమి పూజ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించడం జరిగింది. తదనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఇంకుడుగుంతకు భూమి పూజ చేసి, అక్కడే ఏర్పాటు చేసిన రూట్ ఆఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న జెసి.దివాకర్ ఫంక్షన్ హాల్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనకు తాగడానికి మరియు సాగుకు నీరు అత్యంత ముఖ్యమన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలు పెంచాలన్నారు. జలధారలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. యాడికి మండలానికి సీఎం రావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశం ప్రకారం, మన గ్రామంలో కురిసిన ప్రతి వర్షపు చుక్కను గ్రామంలోనే భూమిలోకి ఇంకేలా చూడాలన్నారు. నీటిని నిల్వ చేసేందుకు ట్యాంకులు, కుంటలు మరియు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. తక్కువ నీటితో (పిఎండిఎస్ పద్ధతి) పంటసాగు చేయవచ్చని, జిల్లాలో సుమారు 3 లక్షల హెక్టార్ల కంటే ఎక్కువ పంట వర్షంపైనే ఆధారపడి ఉంటుందని, పిఎండిఎస్ ద్వారా విత్తనాలకు జీవామృతం, ఘన జీవామృతంతో కోటింగ్ ఇచ్చి నాటడం ద్వారా తక్కువ వర్షపాతంతో కూడా పంటలు పండుతాయన్నారు. ?హాఫ్ మూన్ మోడల్ పద్ధతి ద్వారా తక్కువ నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చన్నారు. జలధార కింద 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేశామని, మన దగ్గర పడిన వర్షం నీటిని వీలయినంత వరకు నిల్వ పెంచాలని, వాటర్ కన్జర్వేషన్ వర్క్ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బత్తాయి, దానిమ్మ వంటి ఉద్యానవన పంటలు పండించే రైతులు ఏపిఎంఐపి ద్వారా ప్రయోజనం పొందవచ్చని, మైక్రో ఇరిగేషన్ పద్ధతులను పాటించే రైతులకు 90 శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో గత ఐదారు రోజుల నుండి పోషణ్ పక్వాడ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా ప్రతి మహిళకు చిన్న పిల్లలకు సరైన పోషకాహారం అందేలా చూడాలని పేర్కొన్నారు. రాబోయే 10-15 రోజుల్లో అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పోషకాహారంపై అవగాహన కల్పించాలని కోరారు. కేవలం పేదరికం వల్లనే కాకుండా, ఆర్థికంగా బాగున్న కుటుంబాల్లో కూడా పిల్లలు జంక్ ఫుడ్ (లేస్ వంటివి) తినడం వల్ల సరైన పోషకాహారం అందడం లేదని, కాబట్టి ప్రతి ఇంట్లో పిల్లల ఆరోగ్యంపై





అవగాహన ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు మరియు బరువును 10వ తేదీ లోపు నమోదు చేయాలని, ఇందులో ఎటువంటి తప్పులు ఉండకూడదని, డేటాను తప్పుగా నమోదు చేసిన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, పిల్లల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఐసిడిఎస్ మరియు ఇతర శాఖలన్నీ కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జలధార, జలహారతి వంటి కార్యక్రమాల్లో రైతులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆరె కటిక వెల్ఫేర్ చైర్మన్ హరికృష్ణరావు మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ వికసిత భారత్, సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణ ఆంధ్ర లక్ష్యంగా జలధార – జలహారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. డిపిఓ నాగరాజునాయుడు మాట్లాడుతూ భూగర్భజలాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, నీటి సంరక్షణ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. డ్వామా పిడి సలీమ్ భాష మాట్లాడుతూ సీఎం తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలంలో జలధార కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఉన్న వనరులను అన్నింటినీ, వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు అన్ని గ్రామాల్లో పనులు గుర్తిస్తున్నామన్నారు. కుంటలు, చెరువుల్లో కంపలు, పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని, సప్లయ్ చానల్స్ శుభ్రం చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో మనమందరం భాగస్వాములై వేజ్ జనరేట్ చేయాలన్నారు. పనుల గుర్తింపు ప్రణాళిక జరుగుతోందని, సమగ్రంగా ప్రణాళిక రూపొందించాలని, మంజూరు తీసుకుని 80 రోజుల పాటు పనులన్నీ పూర్తి చేయాలన్నారు. పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చివరగా నీటి సంరక్షణకు కట్టుబడి ఉంటానని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను అందరి చేత చేయించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శశిరేఖ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, ఎంపిపి శ్రీదేవి, తహసీల్దార్ ఉషారాణి, ఎంపిడిఓ, ఏపిడి, సిడిపిఓ, నాయకులు, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం

### -స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర లో పాల్గొన్న అధికారులు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళు, పరిసరాలను, రహదారులను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదరమ్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తూమకుంటలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారితో పాటు ప్రత్యేక అధికారి వెంకటనారాయణ పరిశీలించారు. ఇందులో భాగంగా మురికి కాలువలను శుభ్రం చేయించడం, ట్యాంక్ క్లీనింగ్, చెత్త దిబ్బలు తొలగించడం, ప్రజా ఆరోగ్యం కార్యక్రమం గురించి చర్చలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. ముఖ్యంగా తడి, పొడి చెత్తలను వేరుచేసి అందజేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అదేవిధంగా చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చని పేర్కొన్నారు. అనంతరం హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ శివ కుమార్, హౌసింగ్ డిఈ సునీత, అభివృద్ధి అధికారి, మాజీ సర్పంచ్ రత్నమ్మ, సచివాలయం సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు తదితరుల పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను కాపాడటంపై అవగాహన

### -పారిశ్రామిక వాడలో అగ్నిమాపక వారోత్సవాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆపదలో ఉన్న వ్యక్తులను ఏ విధంగా కాపాడాలి, ఆ వ్యక్తులకు ఆక్సిజన్ తదితర వాటిని ఎలా అందించాలి అన్న అంశాలపై జిల్లా అగ్నిమాపక అధికారి మాధవ నాయుడు ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని పారిశ్రామికవాడలో అగ్నిమాపక వారోత్సవాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరగకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు గుర్తించి బేసిక్ ఫైర్ ఫైటింగ్ శిక్షణ ఇవ్వాలి, ప్రొడక్షన్ విభాగం నుంచి తయారైన వస్తువులు దూరంగా ఉంచాలి, మండే స్వభావం గల వస్తువులు, డస్ట్ ను పేరుకు పోకుండా చూడాలి, పొగ తాగడం నిషేధించాలని తెలిపారు. కర్మాగారాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను నిబంధనల మేరకు ఉంచుకోవాలని సూచించారు. పనిచేసే ప్రదేశంలో రెండు ఎస్టింగ్ విషన్ ఉంచుకోవాలని తెలియజేశారు. అనంతరం ఆపదలో ఉన్న వ్యక్తులను ఏ విధంగా కాపాడాలి, ఎత్తయిన ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు జరిగితే ఏ విధంగా కిందకు తీసుకురావాలి అన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అదే విధంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరపత్రాలను పంపిణీ చేశారు. చేయడమైనది ఈ కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్, మేనేజర్ దేవరాజు, అగ్నిమాపక కేంద్రం,కార్మికులు పాల్గొన్నారు.

## సాంకేతిక సహాయంతో పట్టణ పారిశుద్ధ్యంపై నిఘా

### బాలయ్య పిఏలకు వివరించిన కమిషనర్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి కోసం సాంకేతిక సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య లకు వివరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సాంకేతిక సహాయంతో పట్టణ పారిశుద్ధ్యం పర్యవేక్షిస్తున్న విధానం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ పట్టణంలో ప్రధాన కూడళ్లతో పాటు చెత్త ఎక్కువగా వేసే ప్రాంతాలను గుర్తించి 28 ప్రాంతాలలో సిసి కెమెరోలను అమర్చడం జరిగిందన్నారు. తద్వారా ఆయా ప్రాంతాలలో ఉన్న చెత్తకుండీలో ఏ ఏ ప్రాంతాల వారు చెత్త వేస్తున్నారు, అక్కడి నుంచి ఏ సమయంలో చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించారు, తదితర అంశాలన్నింటినీ పర్యవేక్షించడానికి అవకాశం ఉందన్నారు. దీంతోపాటు ప్రతి వాహనానికి జిపిఎస్ విధానం అమలు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ఏ వాహనం ఏ సమయంలో బయలుదేరింది, ఆ వాహనం ఎక్కడెక్కడ నుంచి చెత్తను సేకరించి, డంపింగ్ యార్డ్ కు ఏ సమయానికి వెళ్ళింది, రోజుకు ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేసిందన్న అంశాలన్నింటిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ విధానం రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ అమలులో ఉందని, శిక్షణ నిమిత్తం అక్కడికి వెళ్లిన సందర్భంలో సమగ్రంగా పరిశీలన చేసి, ఈ విధానాన్ని ఇక్కడ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు పారిశుద్ధ్య విభాగంలో మరిన్ని సంస్కరణలను తీసుకొని వచ్చి చెత్త రహిత పట్టణంగా తీర్చి దిద్దడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని తెలిపారు. సమగ్రంగా పరిశీలన చేసిన బాలకృష్ణ పిఏలు కమిషనర్ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. దీనికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని కమిషనర్ కు తెలిపారు.

## స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

### - ప్రతిఒక్కరూ స్వీయగణన నమోదు చేసుకోవాలి



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

భారతదేశ జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు ప్రభుత్వం సూచించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమంలో పాల్గొనబోతున్న ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చాలా సులభంగా చేసుకోవచ్చు. ఇందులోభాగంగా శనివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకుని తమ పేరుతో సహా సంబంధిత అంశాలను పొందుపరిచి అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ జనగణన 2027లో భాగంగా ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) కార్యక్రమంను ప్రభుత్వం నిర్ణయించడమైనదన్నారు. ఇందులో తాను కూడా భాగస్వామినై స్వయంగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకోవడం జరిగిందన్నారు. ఇదేవిధంగా ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగమై స్వీయగణన చేసుకుని ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ చేకూరుతాయన్నారు. మొట్టమొదటిసారిగా సెన్సెస్ 2027 కార్యక్రమంలో డిజిటల్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా, సెల్ఫ్ ఎన్యుమరేషన్ అతి సులభంగా వెబ్సైట్ లో పౌరులందరూ నమోదు చేసుకోవచ్చు.

# సమన్వయంతో అభివృద్ధి దిశగా అడుగులు

### -బాలయ్య సహకారంతో మరిన్ని నిధులు తీసుకొస్తాం -పనులపై అధికారులతో సమీక్ష

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి పురపాలక శాఖ, రోడ్డు భవనాల శాఖలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని, అవసరమైన నిధులను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో సమీకరిస్తామని ఆయన వ్యక్తిగత కార్యదర్శులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునతో కలిసి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీ నివాసరావు, వీరయ్య, బాలాజీలు అర్అండ్ బి ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ప్రధాన రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పట్టుగూళ్ల మార్కెట్ సమీపంలోని కల్వర్ట్ నిర్మాణం, నంది సర్కిల్ వద్ద కాలువ విస్తరణ, దండు రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం వెడల్పు చేయడం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. రోడ్డు భవనాల శాఖ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. అదే విధంగా చిన్నమార్కెట్ సర్కిల్, బెంగళూరు రోడ్డులో వాల్మీకి సర్వీస్ స్టేషన్ ఎదురుగా, సడ్లపల్లి పెట్రోల్ బంక్ వద్ద, బాలాజీ సర్కిల్ పరిసరాలు, రైల్వే రోడ్డులో నవోదయ బుక్ స్టాల్ సమీపం, ఆటోనగర్ చర్చి బైపాస్, సూగూరు మరువ కాలువ, అంజనేయ స్వామి దేవాలయం వద్ద, భగీరథ సర్కిల్, లారీ యూనియన్ కార్యాలయం, కె.ఎల్. రోడ్డులో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చర్చ్ రోడ్, బెంగళూరు రోడ్డులో హయగ్రీవ దేవాలయం సమీపంలో రోడ్లను వెడల్పు చేసి కల్వర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. కొల్లకుంట ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టణాభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర జలం జీవం

### - వైద్య ఆరోగ్యశాఖ ఇన్చార్జి డాక్టర్ రవిబాబు




ప్రజాభూమి, కడప సిటీ

కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇన్చార్జి డాక్టరు రవిబాబు ఆదేశాలతో స్వచ్ఛ ఆంధ్ర స్వ ర్ణాంధ్ర కార్య క్రమంలో భాగంగాజలం-జీవం పై డి.ఎం.హెచ్.ఓ.కార్యాల యంలో అవగాహన కార్యక్ర మము నిర్వ హించడం జరిగి నది. పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణ ప్రతి ఒ క్కరి బాధ్య త, నీరు మన జీవనాధారం అని గుర్తించి దానిని వృధా చేయకుండా బాధ్య తగా వినియోగిద్దాం అనితెలిపారు.నీటివనరులను కాపాడటం,చెరువులు,కుంటలు శుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ఆరిఫుల్లతెలియజేశారు. ప్రతి ఇంటిలో వినియోగించిన నీటిని పునర్వి నియోగాన్ని ప్రోత్స హించాలన్నా రు. నీటి నిల్వ లు లేకుండా చేయుట ద్వా రాదోమలుపెరుగుదలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికి నీటి ఆవశ్య క త గురించి,నీటి సంరక్షణ కో రకుతీసుకోవలసినజాగ్రత్తలపై ప్రజలకుఅవగాహనకల్పించాలన్నా రు, అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్య క్రమం లో డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్, జిల్లా పరిపాలన అధికారి విజ యభాస్క ర్, డెమో సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్న రు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం మహిళలకు ద్రోహం

### - ప్రతిపక్షాల వైఖరిపై జనసేన నేత దాసరి రవిశంకర్ విమర్శలు



ప్రజాభూమి, కడప సిటీ: మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్ష పార్టీలు దేశంలోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ద్రోహం చేశారని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ విమర్శించారు. మహిళా సాధికారత దిశగా దేశం ముందుకు వేయాల్సిన చారిత్రాత్మక అడుగును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ఆయన తెలిపారు. చట్టసభల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే ఈ బిల్లు ఆమోదం పొందే అవకాశాన్ని ప్రతిపక్షాలు దూరం చేశాయని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలులోకి వచ్చి ఉంటే మహిళలకు గౌరవప్రదమైన స్థానం లభించేదని ఆయన అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో అయినా మహిళా శక్తికి శాసనసభలు, పార్లమెంట్‌లలో తగిన స్థానం లభించాలని ఆయన ఆకాంక్షించారు. లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన చర్యను ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా జనసేన పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే దేశవ్యాప్తంగా మహిళలు ఆనందించేవారని దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణ రెడ్డి, నారాయణ, రామాంజనేయులు, శ్రీను, కృష్ణమోహన్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## కడప కాంగ్రెస్ లో డివిజన్లో ఇన్చార్జిల అభ్యర్థన కొరకై పోటెత్తిన లీడర్లు

### -కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య



ప్రజా భూమి,కడప సిటీ :

శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కడపలో, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య కడప నగరానికి సంబంధించి 38వ డివిజన్ ఇన్‌చార్జ్ పదవులకు పఠాన్ అంజాద్ ఖాన్ (భుట్టో), 9వ డివిజన్ కు చిన్న కుళ్లాయప్ప నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జకరయ్య మాట్లాడుతూ డివిజన్లలో పర్యటించి సమస్యల మీద పోరాడాలని హితవుపలికారు.ఈకార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ భాష, అక్బ ర్,రఫీఖ్ ఖాన్,జహూర్ పాల్గొన్నారు.

## హిందూపురాన్ని అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం

### -రూ.1.44 కోట్ల ఆధునిక చెత్త వాహనాల ప్రారంభం




ప్రజాభూమి, హిందూపురం టౌన్

"రైజింగ్ హిందూపురం" లక్ష్యంగా పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ. 1.44 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు ఆధునిక భారీ కాంపాక్ట్ చెత్త సేకరణ వాహనాలను శనివారం హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్రబాబు, వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ డిఉ రమేష్ కుమార్ ఈ వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూపురం మున్సిపాలిటీని అగ్రగామిగా నిలబెట్టేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎన్నో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన రెండు వాహనాల్లో ఒక్కో వాహనం 12 టన్నుల చెత్త సేకరణ సామర్థ్యం కలిగి ఉండటంతో పట్టణ పారిశుద్ధ్య నిర్వహణకు మరింత అవకాశం కలుగుతుందన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ వాహనాల ద్వారా చెత్త సేకరణ వేగవంతం కావడంతోపాటు వీధుల్లో చెత్త పేరుకుపోయే సమస్యలు తగ్గుముఖం పడుతాయన్నారు. "రైజింగ్ హిందూపురం" లక్ష్యాన్ని సాధించడంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ వాహనాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాఘవేంద్ర, చంద్రమోహన్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సున్మానం

ప్రజభూమి :పీలేరు

కె.వి పల్లి మండలం ఆదర్శ కళాశాల జూనియర్ ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ మూడే శ్రీను నాయక్,ఇంచార్జ్ ప్రిన్సిపల్ చెన్నూరి బాలాజీ, చైర్మన్ రెడ్డి భాషా మరియు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.ఇందులో భాగంగా జూనియర్ ఎంపీసీలో 470 కి 453 మార్కులు సాధించిన పి.చందన,శృతిశ్రీ 470 కి 440 మార్కులు మరియు బైపీసీ గ్రూపులో పి.దివ్య 455 కి 428 మార్కులుతో గర్ల్స్ విభాగంలో మండలం టాపర్స్ గా నిలిచినందుకు బహుమతులు ప్రధానం చేసి అభినందనలు తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా బృందం పాల్గొన్నారు.

## వికలాంగుడికి ఎమ్మెల్యే భరోసా

### -ట్రైసైకిల్ అందజేత



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం విజయనగర్ కాలనీకి చెందిన వికలాంగుడు శ్రీనివాస్‌కు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు సహాయం అందింది. శనివారం ఆయన వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాస్‌కు ట్రైసైకిల్‌ను అందజేశారు. శ్రీనివాస్ తన కుమారుడి ఇబ్బందులను తల్లి గౌరమ్మ ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సిబ్బంది అవసరమైన సహాయం అందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ మాట్లాడుతూ, ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పటికప్పుడు పేదల సమస్యలపై స్పందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. స్థానికులు ఎమ్మెల్యే చొరవను అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అభిలాష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
ఆదివారం 19 ఏప్రిల్ 2026

# జిల్లా లో రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

- రెవెన్యూ శాఖపై సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు కృషి చేయాలి...
- పీజీఆర్ఎస్ ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం అత్యంత ముఖ్యం- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




మదనపల్లి,ప్రజాభూమి ప్రతినిధి :–రెవెన్యూ సేవల్లో వేగం పారదర్శకతతో పెండింగ్ దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. మదనపల్లి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శనివారం రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వివిధ అంశాలపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజలలో రెవెన్యూ శాఖపై సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 33,153 సమస్యలు రాగా 27,657 సమస్యలను 83.42% పరిష్కరించడం జరిగిందన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా మిగిలిన వాటిని కూడా త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు పెట్టిన ప్రతి అభ్యర్థనను ప్రాధాన్యంగా తీసుకొని ఆలస్యం లేకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తక్షణమే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్లో 756 దరఖాస్తులు అందగా 339 ని నాణ్యతగా పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని కూడా మార్గదర్శకాలు అనుసరించి వేగంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు చేరువగా సమస్యలు పరిష్కరించే వేదికగా రెవెన్యూ క్లినిక్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, అక్కడే ఎక్కువ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 22ఏ చుక్కల భూముల సమస్యల పరిష్కారం కీలక అంశమని పేర్కొంటూ, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, చట్టపరమైన విధానాల్లో స్పష్టతతో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మ్యూటేషన్ ప్రక్రియలను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూమి యాజమాన్య మార్పులకు సంబంధించి ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. అలాగే రీ-సర్వే పనులను కచ్చితత్వంతో, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇతర రెవెన్యూ అంశాలపైనా సమగ్రంగా సమీక్షించి, ప్రతి స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలన్నారు. ఇందులో ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జీరో ఖాతాలు, హౌసింగ్ ఫర్ ఆల్, భూ సేకరణ, ఈ ఆఫీస్ ఫైల్స్ నిర్వహణ తదితరాలపై తీసుకోవాల్సిన చర్యలలో పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, సర్వే శాఖ ఏడి భరత్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగభూషణం, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తాసిల్దార్లు, సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో అగ్ని భద్రతపై అవగాహన

### - ప్రమాదాల నివారణే లక్ష్యంగా అగ్నిమాపక శాఖ డెమో
### - అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

అగ్ని ప్రమాదాల తీవ్రతను తగ్గించడంలో అగ్ని భద్రతా పరికరాల సరైన నిర్వహణ అత్యంత కీలకమని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐదవ రోజు అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామి రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది స్థానిక పట్టణంలోని సాయి రజిత ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకుల్లో సంభవించే ఆయిల్ ఫైర్ ప్రమాదాలు, వాహనాల్లో అగ్ని ప్రమాదాలకు దారితీసే కారణాలు, వాటి వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా అగ్నిమాపక శాఖ డెమో నిర్వహించారు. పెట్రోల్ నింపుకునే సమయంలో వాహనదారులు సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారితీస్తుందని అధికారులు హెచ్చరించారు. అగ్ని ప్రమాద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన తక్షణ చర్యలను ప్రత్యక్ష డెమో ద్వారా వివరించారు. అలాగే శ్రీ సాయి రజిత గ్యాస్ గోడౌన్ సిబ్బందికి, పరిసర ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ మేనేజర్ మోహన్, గ్యాస్ గోడౌన్ మేనేజర్ రత్నతేజతో పాటు అగ్నిమాపక సిబ్బంది హరిబాబు, సాలార్, సురేంద్ర రెడ్డి, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా బిల్లు విషయంలో మోడీ ప్రభుత్వం బహిరంగ మోసం బిబి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

మహిళా బిల్లు విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ మహిళలకు, బహిరంగంగా మోసం చేస్తూ అబద్ధాలను ప్రచారం చేస్తూ మహిళలకు తీరని అన్యాయం చేస్తు ఆ మోసాన్ని ప్రతిపక్షాలపై నెడుతున్నాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ! గతంలో 2023లోనే "నారీ శక్తి వందన్" అనే పేరుతో మహిళకు పార్లమెంట్ లో అసెంబ్లీలలో రిజర్వేషన్ కల్పించేందుకు 106వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చి, పార్లమెంటు ఉభయ సభల్లో మరియు రాష్ట్రపతి ద్వారా ఆమోదముద్ర వేయించుకొని కూడా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆ బిల్లును అమలుపరచకుండా 2029లో అమలు పరుస్తామని మాట చెప్పి నేడు జనాభా లెక్కలతో మరియు డీలిమిటేషన్ తో ముడిపెట్టి భారతదేశ మహిళలను మభ్యపెడుతున్నటువంటి ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వం అని ఆయన దుయ్యబట్టారు. కక్షపూరితంగా కావాలనే దురుద్దేశంతో ప్రతిపక్షాలపై నెపం నెడుతూ 2023లోనే చట్ట రూపం దాల్చిన మహిళా బిల్లును అమలుపరచకుండా, దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు అన్యాయం చేయాలనే దురుద్దేశంతో మహిళా బిల్లును డిలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టి 131 వ రాజ్యాంగ సవరణ చట్టం తీసుకువచ్చిన మోడీ ప్రభుత్వానికి విపక్షాలు గట్టి బుద్ధి చెప్పాయని ఇకనైనా మీకు చిత్తశుద్ధి ఉంటే డీలిమిటేషన్ బిల్లుతో కాకుండా 2023లో చట్ట రూపం దాల్చిన నారీశక్తి బిల్లును అమలుపరిచి మహిళలకు రిజర్వేషన్ కల్పించి జన గణన, కుల గణన తర్వాత సీట్లను సైతం పెంచి డిలిమిటేషన్ ద్వారా అన్ని రాష్ట్రాలకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని ఆయన హితవు పలికారు. గతంలో ఈ ప్రతిపక్ష పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు పూర్తిస్థాయి మద్దతు తెలిపి వెంటనే అమలుపరచండి అని కూడా పార్లమెంట్ సాక్షిగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయని ఆయన గుర్తు చేశారు. కానీ నేడు మహిళా రిజర్వేషన్లు అమలుపరచకుండా ఆ తప్పును ప్రతిపక్షాలపై నెట్టడం హాస్యాస్పదమని, ఈ కుట్రబుద్ధి దేశ ప్రజలంతా కూడా గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రతిభ



ప్రజాభూమి పోరుమామిళ్ళ : 2025-26 ఇంటర్మీడియట్ ఫలితా లలో శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ విద్యార్థులు జిల్లా స్థాయిలో బైపీసీ విభాగంలో మొదటి ర్యాంకు కె.స్వరూప 452/455 మార్కులు, ఎంపీసీ విభాగం లో యస్. సైరిల్ 466/470 మార్కులు. రెండవ సంవత్సరం ఫలితాలలో బైపిసి విభాగం నందు జి.వీర బృంద 990/1000, ఎస్.ఎ. కాజా కిజిర్ 990/1000 మార్కులు సాధించినారు. ఇందుకుగాను ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ ఐ ఓ ) వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించి జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించినందుకు గాను ఆయా కళాశాల యాజమాన్యాన్ని ఆర్ ఐ ఓ ప్రశంసించారు. విద్యార్థులకు కొన్ని అమూల్యమైన సూచనలను తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు యాజమాన్యాన్ని కరస్పాండెంట్ కె.పాండురంగారెడ్డి, ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం రామకృష్ణారెడ్డిని మరియు విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేసినారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో నీటి కష్టాలు

### 10 రోజులుగా చుక్కనీరు లేక చిన్నారుల అవస్థలు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్కేఆర్ నగర్ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గత 10 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లులు శనివారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో, పసిపిల్లల పరిస్థితిని గమనించి అధికారులు వెంటనే స్పందించి తాగునీరు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

### - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి- డాక్టర్ ఎస్ఎఫ్ బాషా



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక బాషా హాస్పిటల్ నందు ప్రతి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా వెల్లడించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డా.సుఫియా, ఉచిత కంటి పరిక్షలతో పాటు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డాక్టర్ అందుబాటులో ఉండనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కంటి శుక్లాల సమస్యలపై ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నట్లు ఆయన అన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక బాషా హాస్పిటల్ సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## జల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

### - డిగ్రీ కళాశాలలో నీరు జీవం - ప్రతి బొట్టు అమూల్యం నినాదంతో జల హారతి కార్యక్రమం




ప్రజాభూమి, వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీరు జీవం -- ప్రతి బొట్టు అమూల్యం నినాదంతో జల హారతి, జల సంరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఈ. సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో కుళ్లాయమ్మ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత తీవ్ర సమస్యగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి విలువను గుర్తించి సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఇతరులకు కూడా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌరవ అతిథిగా పాల్గొన్న పంచాయతీ ఈఓ ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నీటి ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వినియోగించాలని, జల సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. అలాగే ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎం. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రపంచం ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో నీటి కొరత ఒకటని తెలిపారు. నీటి వినియోగంపై అవగాహన కలిగి మనతో పాటు భావితరాలను కూడా జాగృతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జల సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర జలం జీవం

### - వైద్య ఆరోగ్యశాఖ ఇన్చార్జి డాక్టర్ రవిబాబు




ప్రజాభూమి, కడప సిటీ:

కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇన్చా ర్జి డాక్టరు రవిబాబు ఆదేశాలతో స్వచ్ఛ ఆంధ్ర స్వ ర్ణాంధ్ర కార్య క్రమంలో భాగంగాజలం-జీవంపై డి.ఎం. హెచ్.ఓ.కార్యాలయంలో అవగాహన కార్యక్రమము నిర్వ హించడం జరిగి నది. పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణ ప్రతి ఒ క్కరి బాధ్య త, నీరు మన జీవనాధారం అని గుర్తించి దానిని వృధా చేయకుండా బాధ్య తగా వినియోగిద్దాం అనితెలిపారు. నీటివనరులను కాపాడటం,చెరువులు,కుంటలు శుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ఆరిఫుల్లతెలియజేశారు. ప్రతి ఇంటిలో వినియోగించిన నీటిని పునర్వి నియోగాన్ని ప్రోత్స హించాలన్నా రు. నీటి నిల్వ లు లేకుండా చేయుట ద్వా రాదోమలుపెరుగుదలను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికి నీటి ఆవశ్యకత గురించి,నీటి సంరక్షణ కో రకుతీసుకోవలసినజాగ్రత్తలపై ప్రజలకుఅవగాహనకల్పించాలన్నా రు, అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్య క్రమంలో డాక్టర్ జె. ప్రవీణ్ కుమార్, పరిపాలన అధికారి విజ యభాస్కర్, డెమో సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నరు.

## చిన్న వయసులో గర్భం - జీవితానికి శాపం

### సిద్దవటంలో అవగాహన సదస్సు



ప్రజాభూమి, సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం ఎంపీడీవో సభా భవనంలో శనివారం చిన్న వయసులో గర్భం దాల్చడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల బాలికలు శారీరక, మానసిక సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల శరీర ఎదుగుదల కుంటుపడటంతో పాటు, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి డిప్రెషన్‌కు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాల్య వివాహాలను అరికట్టడం ద్వారానే ఇటువంటి అనారోగ్య సమస్యలను నివారించగలమని, దీనికోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. పిల్లల హక్కుల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పోక్సో చట్టం, లేబర్ చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అలాగే 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతలా అవగాహన కల్పిస్తున్నా, కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శోభారాణి, ఏఎస్ఐ కొండయ్య, ఎంఈఓ అరుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వరలక్ష్మి మరియు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఎస్ పి బి వి డి ఎలిమెంటరీ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సభ

### విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ




ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధిలో గల పార్వతీపురం ఎస్.పి.బి.వి.డి సభ ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం వీడ్కోలు వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సిద్ధవటం ఏఎస్ఐ సుబ్బారామచంద్ర ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు సనాతన ధర్మం మరియు భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. పాఠశాల కరెస్పాండంట్ ఎం.డి. మధుసూదన్ మాట్లాడుతూ.. తమ పాఠశాల ప్రైవేటుకు దీటుగా ఉచిత విద్యను అందిస్తోందని, పాఠశాల మరింత అభివృద్ధి చెందడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కొత్త విద్యార్థులను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు

### టీడీపీ రాష్ట్ర వాణిజ్య అధికారిక ప్రతినిధి గంజి సుబ్బరాయుడు



ప్రజాభూమి, సిద్ధవటం

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని మాధవరం-1 పంచాయతీలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధికారిక ప్రతినిధి గంజి సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆయన పంచాయతీ పరిధిలోని నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల విన్నపం మేరకు, గత కొంతకాలంగా వినియోగంలో లేక పాడైపోయిన మూడు నీటి మోటార్లను ఆయన స్వయంగా పర్యవేక్షించి బయటకు తీయించారు. ఈ మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సుబ్బరాయుడు మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. కేవలం మోటార్ల మరమ్మతులే కాకుండా, గ్రామంలో ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని సూచించారు. వేసవి ముగిసే వరకు నీటి సమస్య తలెత్తకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ప్రజలకు నిరంతరం తాగునీరు అందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## 25న ఒంటిమిట్టలో శ్రీ సీతమ్మవారి జయంతి వేడుకలు

ప్రజాభూమి, ఒంటిమిట్ట: కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఏప్రిల్ 25వ తేదీన శ్రీ సీతమ్మవారి జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. శనివారంఈ సాయంత్రం 5.30 నుండి 7.30 గంటల వరకు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అమ్మవారికి వసంతిక పూజ, సహస్రనామార్చన మరియు మహా మంగళహారతి వంటి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

## మహిళా బిల్లును అడ్డుకోవడం శోచనీయం

### రాజంపేట జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ



ప్రజాభూమి, రాజంపేట: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతకు అత్యంత కీలకమైన ఈ బిల్లుకు సరిపడా మెజారిటీ రాకపోవడం మహిళా లోకానికి తీరని అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు చట్టసభల్లో 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలనేది జనసేనాని పవన్ కళ్యాణ్ గారి ఆశయమని, దానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం చారిత్రాత్మకమైన ఈ బిల్లును అడ్డుకున్న పార్టీల తీరును ఆయన తప్పుబట్టారు. మహిళా సాధికారత కోసం జనసేన పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, భవిష్యత్తులోనైనా ఈ రిజర్వేషన్లు అమలయ్యేలా అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమ్మవారి భక్తుడికి అండగా అభయ్ హిందూ సేన

## -మునిరామ్ రెడ్డి దంపతులను అభినందించిన రాధా మనోహర్ దాస్.

ప్రజాభూమి తిరుపతి 18:
తిరుపతి రూరల్ మండలం తిరుచానూరులో భక్తుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రముఖ సీనియర్ జర్నలిస్టు, అమ్మవారి భక్తుడు మునిరామ్ రెడ్డికి అభయ్ హిందూ సేన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ రాధా మనోహర్ దాస్ స్పష్టం చేశారు. తిరుచానూరులో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యల వల్ల భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెలుగులోకి తీసుకొనస్తూ, సంబంధిత అధికారులకు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంలో శ్రీ మునిరామ్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే హిందూ జర్నలిస్టు ఫోరం తరపున ధర్నా చేపట్టాలని కూడా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే స్పందించి సాను



కూల హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమం విరమించబడింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, టిటిడి, తుడా అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించి భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాలు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, రింగ్ రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ పరిణామాలతో భక్తులకు త్వరలోనే ఉపశమనం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన శ్రీ మునిరామ్ రెడ్డిని హిందూ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ స్వయంగా పిలిపించుకుని, శ్రీ మునిరామ్ రెడ్డిని మరియు వారి సతీమణి, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పుష్పరెడ్డి దంపతులను శుక్రవారం ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. ఆరోగ్య సమస్యల మధ్య కూడా హిందూ ధర్మం కోసం, భక్తుల సేవ కోసం కృషి చేస్తున్న ఈ దంపతుల సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా భక్తుల హక్కుల కోసం, ధార్మిక పరిరక్షణ కోసం అభయ్ హిందూ సేన ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తిరుచానూరులో భక్తులపై జరిగిన దాడుల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, స్థానిక హిందూ సంఘాలు మరింత చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీవారిని సేవిద్దాం -- భక్తులను ఆదరిద్దాం అనే సంకల్పంతో అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

# తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐ సుమతికి మానవ హక్కుల మండలి సభ్యుల శుభాకాంక్షలు



ప్రజాభూమి తిరుచానూరు 18:
మానవ హక్కుల మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అంబూరుసింధూజ, మరియు కమిటీ సభ్యులు డాక్టర్ మల్లికార్జునరావు, మురళి, లక్ష్మీపతి, సుబ్రమణ్యం, మధుసూదన్, చందన కలిసి తిరుపతి పట్టణంలోని తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ సుమతిని కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి, విధుల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ మానవ హక్కుల మండలి తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు న్యాయం, భద్రత కల్పించే దిశగా ఆమె సేవలు మరింత ప్రజలకు చేరువ కావాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు పాల్గొని నూతన బాధ్యతలలో సుమతి సమర్థవంతంగా సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని కలిసిన టీటీడీ జెఈఓ డాక్టర్ శరత్ -- వివాహానికి ఆహ్వానం.

ప్రజాభూమి తిరుపతి18:
తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డిని టీటీడీ జెఈఓ డాక్టర్ శరత్ (ఐఏఎస్) మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం దివాకర్ రెడ్డి నివాసానికి విచ్చేసిన జెఈఓ, తన కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు అంశాలపై ముచ్చటించారు. అనంతరం దివాకర్ రెడ్డి అభినందనలు తెలియజేస్తూ, వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఇదివరకు తొలిసారి తన నివాసానికి విచ్చేసిన జెఈఓ శరత్‌ను దివాకర్ రెడ్డి దుస్సలావతో సత్కరించారు.





# సూళ్లూరుపేట తహసిల్దార్ కార్యాలయంలో నామమాత్రంగా పచ్చదనం కార్యక్రమం

**ఫోటోలకు పరిమితమైన అధికారులు -- పరిశుభ్రతపై నిర్లక్ష్యం ఆరోపణలు**
**ప్రభుత్వం ఆదేశాలను పట్టించుకోని సిబ్బంది -- చర్యలు కోరుతున్న ప్రజలు**

ప్రజాభూమి సూళ్లూరుపేట 18
సూళ్లూరుపేట తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం తూతూ మంత్రంగా జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెల 4వ శనివారం ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని సక్రమంగా అమలు చేయలేదని ఆరోపిస్తున్నారు. కార్యక్రమం పేరుతో అధికారులు కేవలం ఫోటోలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని ప్రజలు అంటున్నారు. కార్యాలయ పరిసరాల్లో సరైన పరిశుభ్రత చర్యలు కనిపించలేదని వారు చెబుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడుతోందని అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే ఇలా వ్యవహరించడం ఆందోళనకరమని పేర్కొంటున్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధమని స్థానికులు భావిస్తున్నారు. పై అధికారులు వెంటనే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు నిజంగా అమలయ్యేలా పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు.




# తిరుపతి జిల్లా పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛత జోరు -- 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమానికి విశేష స్పందన

ప్రజాభూమి తిరుపతి18:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది తమ తమ పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాల పరిసరాలను శుభ్రపరిచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు. స్టేషన్ ఆవరణల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించడం, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం వంటి చర్యలు చేపట్టారు. అదనంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్వచ్ఛతను పాటించాలని పోలీస్ అధికారులు సూచించారు.





# తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని కలిసిన టీటీడీ సొసైటీ కార్మికులు



ప్రజాభూమి తిరుపతి 18:
తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డిని టీటీడీ సొసైటీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ సొసైటీ డిపార్ట్‌మెంట్ లో విధులను నిర్వహిస్తున్న కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ దీర్ఘకాలిక సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులు విన్నవించిన ప్రతి సమస్యను డాలర్స్ దివాకర్ రెడ్డి ఎంతో శ్రద్ధగా విన్న తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి. సమస్యలను అర్థం చేసుకున్న ఆయన, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్మికుల పట్ల తుడా చైర్మన్ చూపిన సానుకూల స్పందన పై సొసైటీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా మరియు బోర్డు పరంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారని తెలిపి, హర్షం వక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సొసైటీ కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర జలధార - జల హారతి కార్యక్రమం భాగంగా

# పేరూరు చెరువు వద్ద నీటి సంరక్షణకు సుస్థిర ఆంధ్రకు మార్గం అనే కార్యక్రమం

- జలధార- జలహారతి లో భాగంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ తో పనులు: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్
- నీటి సంరక్షణకు సాగునీటి సంఘాల ద్వారా పటిష్ట పరిచి భూగర్భ జలాలను పెంచే విధంగా చర్యలు : ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి.
భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం "జలధార–జలహారతి". 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.. శనివారం స్థానిక చంద్రగిరి నియోజకవర్గం పేరూరు చెరువు వద్ద స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జలధార జలహారతిలో ఎం ఎల్ ఎ పులివర్తి నాని తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి భద్రతను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం "జలధార–జలహారతి". 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి జిల్లా వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంపై ఈ కార్యక్రమం దృష్టి పెడుతుందనీ అన్నారు. ప్రభుత్వం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా నీటి నిల్వలు పెరిగి... వ్యవసాయానికి, త్రాగునీరుకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్నది ఎండాకాలం... వేసవి తాపానికి ప్రజలు, రైతులు ఇబ్బంది పడకూడదన్న ముందస్తు జాగ్రత్తలు భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం





చేపడుతుందన్నారు.. 100 రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో చెరువులను , నీటి కుంటలను కాపాడుకుంటూ నీటి వనరులను పెంచుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. చెరువు కట్ట సంరక్షణకు జల వనరుల శాఖ అధికారులకు కొన్ని సూచనలు సలహాలు కలెక్టర్, ఎమ్మెల్యే ఇవ్వడం జరిగింది. స్వయంగా ఎమ్మెల్యే ద్విచక్ర వాహనంలో కలెక్టర్ ని ఎక్కించుకొని చెరువుగట్ట పరిసర ప్రాంతాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జల వనరుల శాఖ ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, సాగునీటి సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జలసంరక్షణ మనందరి బాధ్యత - ఎమ్మెల్యే ఆరణి

ప్రజా భూమి తిరుపతి 18:
జల సంరక్షణ మనందరి బాధ్యత అని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం చెన్నారెడ్డి కాలనిలోని కృష్ణమ నాయుడు పుష్కరిణి జలధార – జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించి హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శనివారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జలధార – జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి శనివారం ఒక నినాదంతో ముందుకు వచ్చి ప్రజల్లో శుభ్రతపై చైతన్యం కలిగితున్నామని తెలుప్పారు. ఈ నెల వర్షపు నీటి పరిరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణ పై ప్రజలకు అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లో అందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇండ్లు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి మాట్లాడుతూ నీటి పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని, నీరు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ అభివృద్ధి జరిగితుందని తెలిపారు.



భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వీటిపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడు పుష్కరిణిలో జలధార – జలహారతి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో నీటిని వృధా చేయ కుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అవిలాల - పేరూరు చెరువుల అనుసంధానం- అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
తిరుపతి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా, నేడు అవిలాల ట్యాంక్ బండ్ అభివృద్ధి మరియు పేరూరు చెరువు నుండి అవిలాల చెరువుకు నీటి అనుసంధానం కల్పించడంపై తుడా మరియు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి . అధికారులకు తగిన సూచనలు,సలహాలు చేస్తూ స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి .మాట్లాడుతూ ఇరిగేషన్, రెవెన్యూ, మరియు తుడాకి సంబంధించిన ల్యాండ్ అక్విజిషన్, ప్లానింగ్ మరియు ఇంజనీరింగ్ విభాగాల అధికారులు ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. పేరూరు చెరువు నుండి అవిలాల వరకు నీటి మళ్లింపు మరియు అనుసంధానం ద్వారా నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. అవిలాల ట్యాంక్ బండ్‌ను పర్యాటక పరంగా మరియు ప్రజల వినోదం కోసం మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ఇంజనీరింగ్ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. వనరుల పరిరక్షణతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన చర్యలు తీసుకుని,ప్రజలకు ఉపయోగపడే స్థిరమైన మరియు శాశ్వత అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. శెట్టిపల్లి భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, పారదర్శకత ఉండేలా చూడాలని అధికారులకు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, ఎస్ ఈ రవీంద్రయ్య,సీపిఓ దేవికుమారి, భూసేకరణ అధికారి సుజన, తుడా ప్లానింగ్, ఇంజనీరింగ్ మరియు ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు,ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనం చేసిన మాజీ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్



ప్రజా భూమి శ్రీకాళహస్తి 18:
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి దేవస్థానంలో మాజీ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ( రిటైర్డ్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.కే. వెంకటేశులు ఆయనను ఆహ్వానించి, స్వామి వారి అంతరాలయ దర్శనం మరియు వేద ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, తాసిల్దార్ టి.వి. సుబ్రహ్మణ్యం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఏపీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

# అమరరాజలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
పి4 – పేదరిక నిర్మూలన కార్యక్రమం లో భాగంగా బంగారు కుటుంబాల్లో నిరుద్యోగులైన వారి కొరకు అమరరాజ కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శారదా దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరులోని అమరరాజా కంపెనీల్లో మెషిన్ ఆపరేటరేటింగ్ విభాగంలో 400 ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐ టి ఐ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి 13 నుండి 15 వేల రూపాయలు జీతం ఇస్తారని తెలిపారు. బంగారు కుటుంబాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలు, దరఖాస్తుల కొరకు నగరపాలక సంస్థలోని రాజశేఖర్ 8886747853 ను సంప్రదించాలని తెలిపారు.

# అలిపిరి మెట్ల మార్గంలో తప్పిపోయిన బాలుడు - వేగవంతమైన చర్యలతో సురక్షితంగా కుటుంబానికి చేరవేత

ప్రజా భూమి తిరుపతి అలిపిరి 18:
అలిపిరి మెట్టు మార్గంలో తప్పిపోయిన ఒక బాలుడిని తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ సిబ్బంది తక్షణ చర్యలతో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమిళనాడు రాష్ట్రం చంగల్‌పట్టు ప్రాంతానికి చెందిన 12 సంవత్సరాల ఆదర్శ్ అనే బాలుడు అలిపిరి మెట్ల మార్గంలో సుమారు 2500వ మెట్టు వద్ద తప్పిపోయినట్లు విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ఏవీఎస్వోలు సిబ్బందిని అప్రమత్తం చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుమలలోని గ్యాజ-2 ప్రాంతంలో బాలుడు ఉన్నట్లు విజిలెన్స్ మరియు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. తరువాత బాలుడిని సురక్షితంగా లేపాక్షి సర్కిల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకువచ్చి, సంబంధిత అధికారుల సమక్షంలో అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి కుటుంబ సభ్యులు విజిలెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తప్పిపోయిన బాలుడిని త్వరితగతిన గుర్తించి సురక్షితంగా కుటుంబానికి చేరవేసిన విజిలెన్స్ సిబ్బందిని టీటీడీ ఉన్నతాధికారులు అభినందించారు.



# ప్రజాభూమి

## తిరుపతి,చిత్తూరు

9

ఆదివారం 19 ఏప్రిల్ 2026


# పేదల ప్రాణాలతో..బిజినెస్

- నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు
- కిరాణ షాపుల్లా వెలుస్తున్న మెడికిల్ షాపులు..
- బిల్లులు లేకుండా శాంపిల్స్ అమ్మకాలు
- నిద్రావస్థలో డ్రగ్స్ అధికారులు
- మెడికల్ షాపుల యాజమానుల గుప్పెట్లో అధికారులు
- గూడూరులో సమ్మర్ డిస్కౌంట్లు పేరుతో మెడికల్ మాఫియా దందా

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు.

ఓ ఫార్మాసిస్టు ఉండడు..ప్రిస్కిప్షన్ అవసరం అసలే ఉండదు. మెడిసిన్స్ మాత్రం యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తుంటారు. ఏ మందు కావాలంటే ఆ మందును డాక్టర్ చీటి లేకుండానే చేతిలో పెట్టేస్తుంటారు. కడుపు నొప్పొచ్చినా, కాలు నొప్పొచ్చినా మెడికల్ షాప్ కు వెళ్తే మందులిచ్చేస్తున్నారు. నిద్ర రాకపోయినా, గర్భం వద్దనుకున్నా ఏ మందు పడితే ఆ మందును ఇట్టే ఇచ్చేస్తున్నారు. నెల్లూరు, జిల్లా గూడూరులో హోల్ సేల్ ఏజెన్సీ లతోపాటు మెడికల్ షాపులపై నియంత్రణ కొరవడింది. దీంతో అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్యులను దోచుకుని తింటున్నారు.



నెల్లూరు జిల్లా గూడూరు ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్ల దోపిడీ రోజురోజుకు భయంకర రూపం దాల్చుతోంది. వైద్యం అనే పవిత్ర వృత్తిని వ్యాపారంగా మార్చి, పేద ప్రజల జేబులకు చిల్లులు పెట్టే విధంగా అమానుషంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకసారి ఆసుపత్రి గడప దాటితే చాలు... పేషెంట్ కన్నా బిల్లు పెద్దదవుతోంది. డాక్టర్ చెప్పిందే వేదం అన్న నమ్మకంతో వచ్చే పేదవాడు చివరకు తన ఇల్లు, పొలం, బంగారం అమ్ముకునే పరిస్థితికి చేరుతున్నాడు. కానీ అదే సమయంలో ఈ దోపిడీపై సంపాదిస్తున్న డబ్బుతో కొంతమంది వైద్యులు కోట్లకు పడగలెత్తి, విలాసవంతమైన జీవితాలు గడుపుతూ ఏసీ కార్లలో తిరుగుతున్నారు. సాధారణ చికిత్సకే లక్షల రూపాయల బిల్లులు వేస్తూ దోచుకుంటున్నారు. ఈరకంగా ఆసుపత్రుల్లో జరుగుతున్న దోపిడీ మరింత ఆందోళన కలిగిస్తోంది.

**దర్జాగా జీరోదందా**

అర్హత లేకుండానే మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. జీరో వ్యాపార కేంద్రాలుగా నెల్లూరు తిరుపతిలో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. అర్హత లేకుండానే మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ల ప్రిస్కిప్షన్లు ఉండవు. ఎవరు మందులు అడుగుతే వారికి ఇచ్చుడే ఇచ్చిన మందులకు బిల్లులు లేకుండానే నిలువు దోపిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చదువు లేని వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జెనరిక్ మందులను కూడా ఎమ్మార్పీకి విక్రయిస్తు దోచుకుంటున్నారు. అధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా మామూళ్ల మత్తులో ఉన్నారనే విమర్శలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండానే విక్రయాలు**

మెడికల్ షాపులో మందుల విక్రయాలు తప్పనిసరిగా డాక్టర్ల ప్రిస్కిప్షన్ ఉంటేనే మందులు అమ్మాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ మెడికల్ షాపులు నిర్వాహకులు ఆ నిబంధనలు పాటించకుండా ఎవరికి పడితే వారికి ఏవి పడితే అవి మందులను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే మెడికల్ షాపులు నిబంధనలు అతిక్రమించి శాంపిల్స్ (జీరో దందా) అమ్మకాలు చేపడుతూ లాభార్జనే ధ్యేయంగా ప్రజలను దోపిడీకి గురిచేస్తున్నారు. మెడికల్ షాపు నిర్వహకులు కన్సల్టెంట్ డాక్టర్స్ కు గదులను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిర్వహిస్తున్న ఆర్.ఎం.పిలను గుప్పిట్లో పెట్టుకొని ముడుపులను ఆశగా చూపి రోగులకు అనవసరమైన మందులను అంటగడుతున్నారని విమర్శలు ఉన్నాయి.

వైద్యులు రాసిన మందులకు బదులుగా వేరే కంపెనీల మందులు ఉన్నాయంటూ జీరో దందాకు తెర లేపుతున్నారు. బ్రాండెడ్ కంపెనీలవి ఇవ్వకుండా అంటగడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**అర్హత లేని వ్యక్తులతో మందుల అమ్మకాలు**

మెడికల్ షాపులో ఫార్మసీ చదివిన వ్యక్తులతో అమ్మకాలు చేపట్టాలని నిబంధనలు ఉన్నప్పటికీ, మెడికల్ షాపులో యాజమాన్యం అర్హతలేని వ్యక్తులతో మందులను అమ్మకాలు చేపడుతూ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. నియంత్రించాల్సిన ఔషధ అధికారులు మెడికల్ షాపుల నిర్వహణపై ఎలాంటి. పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు అర్హత లేని వ్యక్తులతో మందుల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. డాక్టర్లు రాసిన ప్రీస్క్రిప్షన్లు అర్థంకాక ఒకరకం మందులకు బదులుగా వేరేరకం మందులను అంటగడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులో ఎక్కడ కూడా బీ ఫార్మసీ, డి ఫార్మసీ చదివిన వ్యక్తులు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలను మరచి ఎవరు పడితే వారు అర్హతలుఉన్నా.. లేకున్నా.. మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**బిల్లులు లేకుండానే మందుల విక్రయాలు**

మెడికల్ షాపుల నిర్వహణలో మందులు కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లును ఇవ్వాలి. అయినప్పటికీ మెడికల్ షాపుల యజమానులు బిల్లులు ఇవ్వకుండా మందుల అమ్మకాలు చేపడుతున్నారు. అయితే జనరిక్ మందులను బ్రాండెడ్ కంపెనీలుగా చూపిస్తూ రెట్టింపు డబ్బులను ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నారు. తీరా చూసి జనరిక్ మందులు అని ప్రశ్నిస్తే ఈ మందులు ఆ మందులు ఒకే రకంగా ఉన్నాయని రకరకాల సమాధానాలు చెపుతూ మాట దాటవేస్తున్నారని రోగులు వాపోతున్నారు. బిల్లులు ఇవ్వమని అడిగుతే చాలా మంది మందుల కోసం నిలబడుతరని కాబట్టి అలస్యం అవుతుందని డొంక తిరుగుడు సమాధానం ఇస్తున్నారని రోగులు వాపోతున్నారు. బిల్లులు ఇస్తే తమ బండారం బట్టబయలు అవుతుందని బిల్లులు ఇవ్వకుండా మందుల అమ్మకాలు జరుపుతున్నారని వాపోతున్నారు..

**నిద్రావస్థలో డ్రగ్స్ అధికారులు**

ఎలాంటి మందులు అమ్మినా.. పట్టించుకునే వారు ఉండరనే ఉద్దేశ్యంతో మెడికల్ షాపుల యజమానులు నాణ్యమైన బ్రాండెడ్ కంపెనీలు కాకుండా నాసిరకం మందులను అమ్ముతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మెడికల్ షాపులను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు మామూలు మత్తులో పడి మెడికల్ షాపుల పర్యవేక్షణను విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సంవత్సరానికి ఒకసారి కూడా ఈ మందులు అమ్ముతున్నారని ఎంత స్టాక్ ఉన్నదని స్టాకు సంబంధించిన లెక్కలు, బ్రాండెడ్ కంపెనీల మందులా.. నాసిరకం మందులా.. అనే కనీస పర్యవేక్షణ లేకుండా పోయిందని వాపోతున్నారు.

# అమర రాజా విద్యాలయం 30వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం కరకంబాడిలోని అమర రాజా కంపెనీ లోనే ప్లాంట్ నీ సందర్శించారు అనంతరం అమర రాజా విద్యాలయంలో 30వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సమగ్రత ఒక దృష్టి, ఒక హృదయం, ఒక లక్ష్యం" అనే ప్రధాన థీమ్‌తో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, గల్లా రామచంద్ర నాయుడు మన జిల్లా లో అమర రాజా సంస్థలను స్థాపించి దాదాపు 40 సంవత్సరాలుగా దేశ విదేశాలకు సేవలందిస్తున్నారు, అదేవిధంగా అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారు, విద్యారంగంలో అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు, ఈ విద్యా సంస్థలు ద్వారా వేలమంది నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు, విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో నిలిచిపోకుండా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సమగ్ర ప్రక్రియగా మారాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే నైతిక విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలను అలవర్చుకోవడం అత్యవసరమని సూచించారు. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తు నాయకులని, వారికి జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, బాధ్యత, సేవాభావం కూడా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే వేదికలుగా మారాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. గౌరవ అతిథి అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరినేని మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమబద్ధంగా కృషి చేస్తే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించగలరని అన్నారు.






ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, శారీరక-- మానసిక దృఢత్వం ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. అమర రాజా గ్రూప్ సప్లై చైన్ ప్రెసిడెంట్ ఎల్. వెంకట్ మాధవ్ మాట్లాడుతూ, సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విజయానికి మూడు కీలక సూత్రాలని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఈ విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా అగ్రగాములుగా నిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సంగీత ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నళిని కుమార్ , రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ , ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 16వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్-2026 కార్యక్రమం

## ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి






ప్రజా భూమి ప్రతినిధి, చిత్తూరు

చిత్తూరు పట్టణములోని బి.టి. కాంపౌండ్ గ్రౌండ్ నందు నిర్వహిస్తున్న 16వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్--2026 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వచ్చిన జూనియర్ మహిళల హాకీ జట్లు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారిణులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ మరియు సౌకర్యాలు కల్పించడం ద్వారా భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి ప్రతిష్ఠ తీసుకురాగల క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులు ఇటువంటి వేదికల ద్వారా తమ ప్రతిభను రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలకు చాటుకోవాలని ఆకాంక్షిం చారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం,



క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు మంచి మార్గమని కూడా సూచించారు. ఈ సందర్భంగా జట్ల క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలియజేసి, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలు మన జీవితంలో ఒక ముఖ్య భాగమని, అవి ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ హాకీ మ్యాచ్‌ను వీక్షించి క్రీడాకారిణుల ప్రతిభను అభినందించారు. ఆటలో చూపిన చురుకుదనం, సమన్వయం, కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, పాల్గొన్నారు.



## సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాణశాలలో శనివారం నాడు హైదరాబాద్ చెందిన హెటిరో డ్రగ్స్ సంస్థ బి. ఫార్మసీ మరియు యం. ఫార్మసీ విద్యార్థులకు ప్రొటెక్షన్, నాణ్యత నిర్ధారణ మరియు ఔషధ నాణ్యత పరీక్ష అను విభాగాలలో ఉద్యోగాలకు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ నియామకాలలో హెటిరో డ్రగ్స్ సంస్థ తరపున హెచ్ ఆర్ మేనేజర్ అదవి రాముడు పాల్గొని విద్యార్థులకు రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్ష ద్వారాం 20 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కంపెనీ తరపున 2.8 లక్షలు వార్షిక వేతనంగా అందజేయనున్నట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య తెలిపారు. ఈ నియామకాలలో సుమారు 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందచేసారు. ఈ కార్యక్రములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ పవన్ కుమార్ పాల్గొన్నారు .







## బీసీ సంక్షేమ సంఘం వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి రెహమాన్ జన్మదిన వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి



బీసీ సంక్షేమ సంఘం వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి, యువకుల్లో స్ఫూర్తి నింపుతూ బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న తమ్ముడు పి. రెహమాన్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కంభం లోకయ్య , అధికార భాష సంఘం మాజీ సభ్యులు డాక్టర్ డి. మస్తానమ్మ , జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పంచవటి జ్యోతి గారు, లింగేశ్వర్ నగర్ ఎంపీటీసీ కి. నాగభూషణమ్మ , ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు కోటి యాదవ్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ నేతలు తిరుపతి పాత మున్సిపల్ ఆఫీసు ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, రెహమాన్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు

## వాకాడు గురుకులం లో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వాకాడు మండలంలో విజయవంతంగా నిర్వహించబడింది. వాకాడు గురుకుల పాఠశాలలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమక్షంలో జరిగింది. ఈ రోజు కార్యక్రమం యొక్క అంశం వాటర్ పాజిటివ్ ఆంధ్ర ఇది నీటి సంరక్షణ, స్థిరమైన వినియోగం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఈ సందర్భంగా పాల్గొన్నవారు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ స్వీకరించి, పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎంపీడీఓ ప్రసంగిస్తూ, నీటి సంరక్షణ అత్యంత అవసరమని వివరించి, దైనందిన జీవితంలో బాధ్యతాయుతమైన పరిశుభ్రమైన మరియు నీటి భద్రత కలిగిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ కలసి కృషి సంకల్పం అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఎంఈఓలు, డిప్యూటీ ఎంపీడీఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేవ్ గ్లో గ్రాండ్ లాంచ్ తిరుపతిలో సహజ సౌందర్య విప్లవానికి శ్రీకారం

### ముఖ్య అతిథులుగా తిరునామలీ, రూపేష్ బాబు, విజయ్ కుమార్ హాజరు.

ప్రజా భూమి తిరుపతి 18 :

ప్రకృతిలోని స్వచ్ఛమైన మూలికలతో, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేసి రూపొందించిన సహజ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ 'వేవ్ గ్లో' తిరుపతిలో ఘనంగా ప్రారంభం కానుంది. రాజ్ గ్రూప్స్ అధినేత, ప్రముఖ సామాజికవేత్త లయన్. జె.సి. డాక్టర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ బ్రాండ్ వినియోగదారులకు అందుబాటులోకి రానుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 18, 2026 (శనివారం) ఉదయం 8:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు, తిరుపతి లోని మహతి ఆడిటోరియంలో వైభవంగా నిర్వహించబడుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరునామాలు, రూపేష్ బాబు, విజయ్ కుమార్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు, సీఈఓ మరియు బిజెపి తూర్పు మండల ఉపాధ్యక్షులు లయన్. జె.సి. డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో రసాయనాలతో కూడిన ఉత్పత్తుల వల్ల చర్మం, జుట్టు సమస్యలు పెరుగుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను అందించాలనే ఉద్దేశంతో 'వేవ్ గ్లో'ను ప్రారంభించాం. రైస్ వాటర్ ఫేస్ టోనర్, రెడ్ ఆనియన్ షాంపూ, స్కిన్ వైటనింగ్ మాస్క్ వంటి మా ఉత్పత్తులు అన్ని రకాల చర్మ తత్వాలకు అనుకూలంగా ఉంటాయి," అని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. అన్ని విడి ఉత్పత్తులపై 40% వరకు భారీ తగ్గింపు ఇవ్వడంతో పాటు, పూర్తి కాంబో ప్యాక్‌ను కేవలం ?2,035 (అసలు ధర ?3,392)కు అందించనున్నట్లు తెలిపారు. తిరుపతి ప్రజలు, సౌందర్యాభిమానులు మరియు పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి విచ్చేసి సహజ సౌందర్య ఉత్పత్తులను పరిశీలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



ప్రజాభూమి



# 500 రూ.లు రాహు కేతు పూజలు రద్దు సరైనది కాదు!

- సామాన్య భక్తులు కోసం వినతి పత్రం సమర్పించిన బిజెపి నేతలు
- 500 రూ. రాహుకేతు పూజలు కొనసాగించండి.. బిజెపి నేతలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ సూచనలు మేరకు సామాన్య భక్తుల 500 రూ.లు రాహుకేతు పూజలు కొనసాగించండని శ్రీకాళహస్తీశ్వరా స్వామీవారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బి కె వెంకటేశులుకి శ్రీకాళహస్తి బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించడం జరిగినది. రెండు రోజులు క్రితం దేవస్థానం పాలకమండలి సమావేశంలో 500 రూ.లు రాహుకేతు పూజలను రద్దు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకించడం జరిగినది. శ్రీకాళహస్తి దేవాలయం రాహుకేతు పూజలకు ఒక ప్రత్యేక స్థానం కలదు. ఇక్కడ రాహుకేతు పూజలు చేసుకొంటే కష్టాలు తీరుతాయని, అన్ని మంచి ప్రయోజనాలు జరుగుతాయని భక్తుల విశ్వాసం. ప్రస్తుతం పేద భక్తుల కోసం 500 రూ.లు, మధ్యతరగతి వారికి 750, 1500 ధనికుల కోసం 2500, 5000 రూ.లు రాహుకేతు పూజ టికెట్లు అమల్లో కలవు. మొన్న జరిగిన బోర్డు సమావేశంలో పేద భక్తుల 500 రూ.లు రాహుకేతు పూజలను రద్దు చేయాలని నిర్ణయాలు చేయడం సరైనది కాదని.. దాన్ని ఉపసంహరించుకోవాలని బీజేపీ నేతలు ఈఓని కోరుతూ.. లేని పక్షంలో తమ పార్టీ సనాతన ధర్మం కోసం సామాన్య భక్తులు కోసం తమ ప్రయత్నం నిరంతరం కొనసాగుతోందని ఈఓ కి విన్నవించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ హరీష్ రెడ్డి, చిలకా రంగయ్య, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞాశ్రీ, ఉపాధ్యక్షురాలు రామ్ ఉమా సింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, జీవి అమర్నాథ్, తానికొండ్ల భరత్ నాయుడు, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, మద్దు వాసు యాదవ్, ఇమ్మిడిశెట్టి మోహన్, ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, కొండమిట్ట రవి, చెందు, యశ్వంత్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ - భక్తి, సేవకు కొత్త దిశ



ప్రజాభూమి తిరుపతి 18: తిరుపతి ప్రాంతంలో భక్తి పరంపరను విస్తరించాలనే లక్ష్యంతో గోవింద దీక్ష వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిటీ అధ్యక్షులు ప్రబోధానంద స్వామి నాయకత్వంలో, ఉపాధ్యక్షులు ప్రతాపరెడ్డి, జనరల్ సెక్రటరీ జగన్నాధం మరియు సభ్యులు రామానుజలు, సుబ్బారెడ్డి, వాసుదేవమూర్తి, సందీప్ తదితరులు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

భక్తి ప్రచారం -- సేవ ప్రధాన లక్ష్యం : గోవింద దీక్షను మరింత విస్తృతంగా భక్తులకు చేరవేయడం, దీక్ష చేపట్టే భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం అందించడం ఈ కమిటీ ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొంది. ముఖ్యంగా, దీక్ష భక్తులకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతి సంవత్సరం కార్యక్రమాలు : ఈ కార్యక్రమాన్ని ఒక్కసారిగా కాకుండా ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ, భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించాలన్న దృఢ సంకల్పంతో (సేవా వేదిక) ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తి, సేవ, సామాజిక బాధ్యతల సమన్వయంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. భక్తులకు ఆహ్వానం గోవింద దీక్ష చేపట్టే భక్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, స్వామివారి కృపను పొందాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. భక్తి మార్గంలో ముందుకు సాగాలనుకునే ప్రతి ఒక్కరికీ ఇది ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు.

## తొండమనాడు విద్యార్థుల ప్రతిభ

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి రూరల్



ఫిబ్రవరి 14, 15 తేదీల్లో శ్రీకాళహస్తి ఆర్పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ (హైదరాబాద్) పరీక్షల్లో తొండమనాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రథమ, మధ్యమ స్థాయిల్లో మొదటి మూడు స్థానాలను విద్యార్థులు అధిగమించారు. విద్యార్థులు వింధ్య, వంశీ, యోషిత 98/100 మార్కులతో ప్రథమ స్థానాన్ని సాధించగా, గీతిక, మోక్షాయిని 93/100 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మొత్తం 25 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల జి. కృష్ణయ్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు పద్మావతి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చటర్జీ నగర్ లో కార్డెన్ సెర్చ్

### ... పది వాహనాలు స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి డి.ఎస్.పి కే నరసింహామూర్తి ఆదేశాల మేరకు ఆపరేషన్ వజ్ర ప్రహర్ కార్యక్రమంలో భాగంగా శనివారం తెల్లవారు జామున శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని చటర్జీ నగర్‌లో రూరల్ సీఐ జి. ఇబ్రహీం, ఎస్సై సి.వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో వెళ్లి కార్డెన్ సెర్చ్ చేశారు. అనుమానితులను ప్రశ్నించి వారి వ్యక్తిగత జీవితం నేరమయంగా ఉందా అని పరిశీలించి విడిచిపెట్టారు. 10 ద్విచక్ర వాహనాలకు ఎటువంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో సిఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అనుమాన వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని సీఐ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లి ఆరో తరగతి విద్యార్థులను అడ్మిషన్

ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు



మండల కేంద్రంలోని మనబడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండెలగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముని తిరుమలయ్య మరియు సిబ్బంది ఆవాస ప్రాంతాలలోని గుండె లుగుంట ,విరుపాక్షిపురం, పెద్దగుంట ,గ్రామాల్లో ఆరో తరగతి లో చేరే విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలిసి ఆరో తరగతిలో అడ్మిషన్ చేసుకోవడానికి వారి దగ్గర నుంచి అడ్మిషన్ ఫారాలను పొందడం జరిగింది. తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించడం జరిగింది .ఎలాంటి ఫీజులు లేకుండా ప్రభుత్వం ఉచితంగా విద్యను అందిస్తుంది. పాఠశాలలో ఇంగ్లీష్ బోధన జరుగుతుంది .పిల్లల రక్షణ బాధ్యత వహిస్తామని తెలియజేశారు. ఆవాశ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సి ఆర్ సి హెచ్ఎం విద్యార్థుల రికార్డ్ షీట్లను ఫీడింగ్ హైస్కూల్ అయినా జడ్.పి.హెచ్.ఎస్ గుండెలగుంటకు చేర్చవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.ఎల్. మూర్తి, చెంచయ్య, భాస్కరయ్య, మునీశ్వర్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఢిల్లీ బాబు, రమేష్ రెడ్డి, రమాదేవి సిఆర్పి ధన శంకర్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్, రాజ్ కిరణ్, గుండెలు కుంట హెచ్ఎమ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి తో పలువురు స్థానిక నాయకులు భేటీ



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి శనివారం వాకాడులోని ఆయన నివాసగృహములో ఉండడంతో వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు రామ్ కుమార్ రెడ్డి తో భేటీఅయ్యారు.అనంతరం తెలుగుదేశం పార్టీ చేస్తున్న అరాచకాల గురించి,తాజా రాజకీయాల గురించి రామ్ కుమార్ రెడ్డి కి వివరించారు.అనంతరం రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జెమిలి ఎలక్షన్ వస్తుందని మరల ఆంధ్ర రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన కొనసాగడానికి ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త జగన్మోహన్ రెడ్డి ని మరల ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరు గెలుపు కోసం కష్టపడి పని చేయాలని చెప్పారు.

# శ్రీసిటీలో శ్రీవాణి ఉగాది పురస్కారాల వేడుక

### - పలువురి ప్రముఖులకు పురస్కారాల ప్రదానం




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం

తెలుగు ఉగాదిని పురస్కరించుకుని యేటా శ్రీసిటీలో నిర్వహించే ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందచేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా ప్రముఖ పద్య నాటక కళాకారులు డాక్టర్ మీగడ రామలింగస్వామి హరికథా భాగవతార్ డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రి ఆధ్యాత్మిక వేత్త కందాడై సెల్వన్, జానపద కవి గాయకులు పోల్లూరు జగన్నాధం పురస్కారాలను అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన కళారత్న డా. మీగడ రామలింగ స్వామి 47 ఏళ్లుగా తెలుగు పద్యనాటక రంగంలో కవి, నటుడు, దర్శకుడు, గాయకుడు, రచయితగా విశిష్ట సేవలు అందించారు. గుంటూరు వాసి, తిరుపతి ఎస్వీ సంగీత కళాశాల మాజీ ప్రధానాచార్యులు ముప్పవరపు సింహాచల శాస్త్రి హరికథలో నాలుగు దశాబ్దాల అనుభవం, రామాయణం మరియు కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యులు. ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, మంగళంపాడుకు చెందిన కందాడై సెల్వన్ 36 సంవత్సరాల ఉపాధ్యాయ సేవ అనంతరం దివ్యప్రబంధాన్ని తెలుగులోకి అనువదిస్తూ గ్రామీణ ప్రజలకు శ్లోకాలు, స్తోత్రాలు బోధిస్తున్నారు. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం నివాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రజాకవి, గాయకుడు అయిన పొల్లూరు జగన్నాథం జానపద గాయకులుగా సుపరిచితులు. ఏఐఆర్ , ఈటీవీ మాధ్యమాల్లోను తన కార్యక్రమాలు ప్రసారమై గుర్తింపు పొందారు. పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, ప్రముఖులను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా ఎదుగుతున్న శ్రీసిటీ, మంచి నివాసయోగ్య ప్రాంతంగా రూపుదిద్దుకునే క్రమంలో కళలను ప్రోత్సహిస్తూ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రతినెలా నిర్వహించే శ్రీవాణి కార్యక్రమాల్లో శ్రీసిటీ పరిధిలోని ఉద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని కోరారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధితో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ శ్రీవాణి వేదిక ద్వారా ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమాలను చేపట్టడం పట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని అభినందించారు. శ్రీసిటీలో పచ్చదనం, సమగ్ర ప్రణాళికతో కూడిన అభివృద్ధిని ప్రశంసించారు. తమ ప్రతిభను గుర్తించి ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబీకులు, పరిసర గ్రామాలతో పాటు సూళూరుపేట, శ్రీహరికోట, చెన్నై నుంచి పలువురు సాహిత్య ప్రియులు పాల్గొన్నారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ ప్రయోక్తగా వ్యవహరించారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తిరుపతిలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .స్ఫూర్తితో గ్రంథాలయ అధికారులు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టూడెంట్స్ మరియు రీడర్స్తో కలిసి గ్రంథాలయ పరిసిరాలు గ్రంథాలయ భవన్ లోపల పరిసరాలు రాక్స్, బుక్స్ శుభ్రం చేసి అనంతరం స్వచ్ఛ్ ఆంధ్ర ప్రతిజ్ఞ వారితో చేయించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి అనంతరం కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అయ్యే



విద్యార్థులు రీడర్స్ తో ప్రత్యేకంగా సమావేశమైన సందర్భంలో రీడింగ్ హాల్లో ఏసీ పనిచేయట్లేదని చైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా కార్యదర్శి కి ఏసీలను రిపేర్ చేసి అందుబాటులోకి తీసుకు రావాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి అదేవిధంగా చైర్మన్ మాట్లాడుతూ ఈరోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు . ఒక స్ఫూర్తిగా తీసుకొని మనము మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆలోచనతో తమ వంతు కృషి చేసి శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలని రాష్ట్రాన్ని భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన సుబిక్షమైన ఆనందకరమైన ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి మనందరం గౌరవ ముఖ్యమంత్రిగా ఆదర్శంగా తీసుకొని కష్టపడి ముందుకు పోవాలని నేటి నుండే కొంత సమయాన్ని స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కొరకు కృషి చేయాలని కోరుతున్నామన్నారు ప్రతి ఒక్కరు కూడా రాష్ట్ర అభివృద్ధికి ముందుండి నడవాలని చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి కోరారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి తో పాటు గ్రంథాలయ తిరుపతి అధికారి శివప్రసాద్ సిబ్బంది పలువురు రీడర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ పక్వాడ పక్షోత్సవాలు....



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని శాంతి దుర్గ ఆదేశాల మేరకు తొట్టంబేడు శ్రీకాళహస్తి రూరల్ మండలం దయనేడు వేలం పాడు అంగన్వాడి కేంద్రాల్లో 8వ పోషణ పక్వాడ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సూపర్వైజర్లు ప్రియాంక మంజుల మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలు రెండేళ్లు వయసు వచ్చేవరకు మొదటి 1000 రోజులు పౌష్టికాహారం తీసుకోవడం బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని తెలిపారు




గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రతిరోజు ఆకుకూరలు కాయగూరలు పండ్లు గుడ్లు పాలు చిరుధాన్యాలు తీసుకోవడం వలన పిల్లలకు తల్లులకు ఆరోగ్యమని తెలిపారు ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ లక్ష్మీ బిడ్డలకు ఎత్తుకు తగ్గ బరువు బరువు తగ్గట్టు పిల్లలు ఎదిగేటట్లు పౌష్టికాహారం ఇవ్వాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వేలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి నిర్మల అరుణ నాగమణి దేవి లత గర్భిణీ స్త్రీలు బాలింతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## బడి ఈడు పిల్లలు బడిలోనే పనిలో కాదు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్.

శ్రీకాళహస్తి రూరల్ మండలం బివి పురం గిరిజన కాలనీలో పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కలిగించారు ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్తు తీర్చబడుతుందని నాణ్యమైన విద్య పౌష్టికాహారం ఉచిత పాఠ్య పుస్తకాలు మధ్యాహ్న భోజనం పథకం తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్నారని ప్రతి బిడ్డను బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు గ్రామీణ ప్రాంతాల్లో విద్యతోనే అభివృద్ధి సాధిస్తామని బాల కార్మిక వ్యవస్థ బాల్య వివాహాలు నిర్మూలనకు విద్య తోడ్పడుతుందని పిలుపునిచ్చారు ఇంటింటా కరపత్రములు ప్లే కార్డ్స్ చేతపట్టి ప్రభుత్వ విద్య ఉచిత విద్య ప్రభుత్వ బడి అందరి బడి ఎక్కడికో ఎందుకు దండగా మన ఊరిలో ప్రభుత్వ బడి ఉండగా పిల్లలందరినీ చదివిద్దాం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం ఆడపిల్లలు చదువు దేశానికి వెలుగు ప్రభుత్వ పాఠశాల ప్రగతికి బాట నినాదాలు చేస్తూ తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రగతి కోకన్వీనర్ రామచంద్ర అంగన్వాడి టీచర్ పద్మ బి వి పురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయ కుమారి ఉపాధ్యాయులు మధుసూదన్ గ్రామస్తులు గ్రామంలో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీ కాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పిలుపు

## వారపు సంత ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందకి మార్పు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంటలో తాత్కాలికంగా సంత స్థలం మార్పు చేసి. సంతను పర్యటించిన సంబంధిత, అధికారులు రేణిగుంట టిడిపి నాయకులు. రేణిగుంట ప్రధాన రహదారిలోని రైల్వే బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సంత నిర్వహణపై సమస్యలు



తలెత్తడంతో, సంతను పూర్తిగా నెలరోజుల పాటు మూసివేయడం సరైన నిర్ణయం కాదని స్థానిక టీడీపీ నాయకులు అభిప్రాయపడ్డారు. చరిత్ర కలిగిన రేణిగుంట సంతను నిలిపివేయడం వల్ల వ్యాపారులు, కొనుగోలుదారులు నష్టపోతారని వారు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి సంతకు వచ్చే ప్రజలు, వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారుల నిర్ణయం మేరకు సంతను తాత్కాలికంగా బాలికల కళాశాల ఎదుటికి మార్చారు. ఈ మార్పు ఈ శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. సంత ఏర్పాట్లను రేణిగుంట ఎస్సై ధర్మారెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర, ఈవో రమేష్‌లతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా కలిసి పరిశీలించారు. సంతకు వచ్చే వాహనదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు పర్యవేక్షించారు.

## నేదురుమల్లి తో పలువురు స్థానిక నాయకులు భేటీ

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి శనివారం వాకాడులోని ఆయన నివాసగృహములో ఉండడంతో వాకాడు,కోట, చిట్టమూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు రామ్ కుమార్ రెడ్డి తో భేటీఅయ్యారు.అనంతరం తెలుగుదేశం పార్టీ చేస్తున్న అరాచకాల గురించి,తాజా రాజకీయాల గురించి రామ్ కుమార్ రెడ్డి కి వివరించారు.అనంతరం రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జెమిలి ఎలక్షన్ వస్తుందని మరల ఆంధ్ర రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన కొనసాగడానికి ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త జగన్మోహన్ రెడ్డి ని మరల ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరు గెలుపు కోసం కష్టపడి పని చేయాలని చెప్పారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 11

ఆదివారం 19 ఏప్రిల్ 2026

# "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తిరుపతిలో ఘనంగా నిర్వహణ -ఏప్రిల్ 2026 థీమ్: "జల ధార - జల హారతి"

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో భాగంగా, 18-04-2026 శనివారం నాడు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తిరుపతి నందు మెడికల్ సూపరింటెండెంట్ మరియు ఇంచార్జి ఎమ్మార్వో ఆధ్వర్యంలో లి"జల ధార - జల హారతి" థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం ఘనంగా నిర్వహించడమైనది.

కార్యక్రమ వివరాలు: 1. ప్రారంభం: ఉదయం 9-15 గంటలకు ఆసుపత్రి ఆవరణలో మెడికల్ సూపరింటెండెంట్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మార్వో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 2. జల సంరక్షణ ప్రతిజ్ఞ: "నీటిని సంరక్షిద్దాం - భవిష్యత్తును కాపాడుకుందాం" అనే నినాదంతో వైద్యులు, సిబ్బంది, రోగుల బంధువులతో ప్రతిజ్ఞ చేయించారు.



3. ఇంకుడు గుంతల ఏర్పాటు: ఆసుపత్రి ఆవరణలోని రూఫ్ టాప్ రెయిన్ వాటర్ భూమిలోకి ఇంకేందుకు 1 ఇంకుడు గుంత ఏర్పాటు చేసి "జల హారతి" నిర్వహించారు. 4. అవగాహన సదస్సు: గర్భిణులు, బాలింతలకు "పరిశుభ్రమైన నీరు - ఆరోగ్యమైన తల్లి, బిడ్డ" అనే అంశంపై లెక్చరర్ ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అవగాహన కల్పించారు. డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి నీటి ద్వారా వచ్చే వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. 5. పారిశుధ్య డ్రైవ్: ఆసుపత్రి ఆవరణ, వార్డులు, టాయిలెట్లు, డ్రైనేజీ కాలువలు,



వాటర్ ట్యాంకులు పూర్తిగా శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉండకుండా బ్లీచింగ్ చల్లించారు. 6. గ్రే వాటర్ మేనేజ్‌మెంట్: ఆసుపత్రి లాండ్రీ, కిచెన్ నుండి వచ్చే వ్యర్థ నీటిని గార్డెన్‌కు మళ్లించే ఏర్పాట్లను పరిశీలించారు.

డా. నిర్మలదేవి ఇంచార్జి మెడికల్ సూపరింటెండెంట్ సందేశం:

"ప్రసూతి ఆసుపత్రి అంటేనే శుభ్రతకు, భద్రతకు మారుపేరు. తల్లీ-బిడ్డ ఆరోగ్యానికి పరిశుభ్రమైన నీరు, పరిసరాలు చాలా ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' సాధనలో మన ఆసుపత్రి ముందుండాలి. ప్రతి సిబ్బంది, ప్రతి గర్భవతి, బాలింత బంధువు ఇందులో భాగస్వామ్యం కావాలి. మన ఆసుపత్రికి లిస్టార్ గార్బేజ్ ఫ్రీ సర్టిఫికేషన్, ఓడిఎఫ్ సాధించడమే మన లక్ష్యం" అని తెలిపారు.

డా. ప్రసన్న ఠాగూర్ ఇంచార్జి ఎమ్మార్వో విజ్ఞప్తి: "గర్భిణులు త్రాగే నీరు ఎల్లప్పుడూ కాచి చల్లార్చినది లేదా ఫిల్టర్ చేసినదై ఉండాలి. ఆసుపత్రిలో అన్ని వార్డుల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాము. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, టాయిలెట్లు పరిశుభ్రంగా వాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని సూచించారు. పాల్గొన్నవారు: ,డా శ్రీనివాసులు ఇ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్, డా శ్రీకర్ ఆరోగ్యశ్రీ నోడల్ ఆఫీసర్, డా నిర్మలమ్మ లెక్చరర్ ఇన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కళావతి నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్స్ , స్టాఫ్ నర్సులు, కౌన్సిలర్స్ ,నర్సింగ్ స్టూడెంట్స్, సెక్యూరిటీ సిబ్బంది , శానిటేషన్ సిబ్బంది, గర్భవతుల బంధువులు పాల్గొన్నారు.

# సామాన్యులకు రాహు కేతు పూజలను దూరం చేయకండి రూ. 500 రాహు కేతు పూజలు కొనసాగించాలి : అంజూరు తారక శ్రీనివాసులు



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

ప్రముఖ రాహు - కేతు సర్ప దోష నివారణ క్షేత్రం అయిన శ్రీకాళహస్తి దేవస్థానంలో నియోజకవర్గ ప్రజలకు ప్రతి బుధవారం సామూహిక రాహు కేతు పూజలు నిర్వహిస్తామని పాలకమండలి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. కేవలం నిమ్మకాయలు పెట్టి పూజలు చేస్తే అవి సామూహిక రాహుకేతుల పూజలు కావని, అలాంటి పూజలను క్షుద్ర పూజలు అంటారని తెలిపారు. వాస్తవానికి రాహుకేతు, సర్ప దోష నివారణ పూజలు చేసుకోవడానికి దేశ విదేశాల నుండి భక్తులు విచ్చేస్తున్నారని గుర్తు చేశారు. ఐదు తలలు ఉన్న నాగ పడగ కేతువు అని ఒకతల ఉన్న నాగ పడగ రాహు అని అన్నారు.రాహు కేతుల ప్రతిరూపాలైన వెండి నాగపడకలు పూజలో ఉంచి, పుష్పాలు, నల్లగుడ్డ,ఎర్రగుడ్డ, పసుపు, కుంకుమ నాగపడుగలపై వేస్తూ పూజ చేస్తే అది వ్యక్తిగతంగా పూజ చేస్తున్నట్లు అవుతుందని గుర్తు చేశారు, రాహు కేతు గ్రహదోషాలు కేవలం వ్యక్తిగతంగా ఉంటాయే కానీ సామూహికంగా ఉండవని అన్నారు. అందువల్ల సామాన్య భక్తులకు అందుబాటులో ఉన్న 500 రూపాయల రాహు,కేతు పూజలను యధావిధిగా ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.500 రూపాయలు రాహు కేతు పూజలు రద్దు చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేవస్థానంలో వెండి కొరత లేదని,తాను ఛైర్మన్ గా వున్న హయాంలో వెయ్యి కిలోలు వెండి కొన్నామని, అంతకు ముందు కూడా ఆలయంలో వెండి నిల్వలు ఉన్నాయన్నారు.పూజలు చేసుకున్న తర్వాత ఆయన వెండి నాగ పడగలు మింట్ ద్వారా తిరిగి వెండి కరిగించి నాగ పడగలు తయారు చేస్తూ వున్నారని తెలిపారు. అందువల్ల వెండి ధర పెరుగుదలను సాకుగా చూపి 500 రూపాయల రద్దు చేయడం సమంజసం కాదన్నారు.హొహొదేవస్థానం పాలకమండలి, ఈవోలు ఈ విషయంలో పునరాలోచించి 500 రూపాయలు పూజలు యధావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో చేస్తామని హెచ్చరించారు.స్థానికులపై అభిమానం ఉంటే ప్రతీ రోజు స్థానికులకు ఉచితంగా అంతరాలయ దర్శనం కలిపించాలని ఆలయ అధికారులు, పాలక వర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఓవర్ లోడింగ్, పర్మిట్ లేని ట్రిప్పర్ వాహనాలపై ఎంవిఐ కొరడా

## వాహనాల యజమానులపై 4,54,560 రూపాయలు జరిమాన.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడింగ్,పన్ను చెల్లించకుండా,పర్మిట్ లేని ట్రిప్పర్ వాహనాలపై పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి పి చంద్రశేఖర్ కొరడా జలుపించారు.శనివారం సత్యవేడు ప్రాంతంలో తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తున్న పలు వాహనాలను పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్ ప్రత్యేక డ్రైవ్లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అధిక లోడ్తో ప్రయాణిస్తున్న వాహనాలు, చెల్లుబాటు అయ్యే పర్మిట్ లేకుండా, వాహన పన్ను చెల్లించకుండా రహదారులపై నడుపుతున్న పలు టిప్పర్ వాహనాలు పట్టు పడడంతో కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి 4,54,560 రూపాయలను జరిమాన విధించినట్టు ఈ సందర్భంగా పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేవలం అధిక లోడ్ తో తరలి వెళ్తున్న వాహనాలపై మాత్రవే 4,10,000 రూపాయలు ప్రత్యేకంగా వసూలు చేయడం జరిగిందన్నారు.ఈ క్రమంలో వాహన యజమానులు డ్రైవర్లకు ఎంవిఐ చంద్రశేఖర్ పలు సూచనలు ఇచ్చారు.అనుమతించిన



పరిమితికి మించి అధిక లోడ్‌తో వాహనాలను నడపరాదన్నారు.వాహనాలకు సంబంధించిన పర్మిట్,ట్యాక్స్,ఫిట్‌నెస్,బీమా వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా ఉంచుకోవాలన్నారు. గ్రావెల్ వంటి లోడును తప్పనిసరిగా టార్పాలిన్తో కప్పి రవాణా చేయాలన్నారు.అతివేగం చేయకుండా, నియమిత వేగ పరిమితిని పాటించాలన్నారు. గ్రామాల గుండా ప్రయాణించే సమయంలో గ్రామ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ధూళి,శబ్ద కాలుష్యం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణ నష్టం ఆస్తి నష్టం నివారించవచ్చని స్పష్టం చేశారు. అధిక లోడ్ ,అతివేగం వల్ల వాహనాల నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇది చివరకు రోడ్డు ప్రమాదాలకు దారితీయవచ్చని ఆయన సూచించారు.ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని,ఈ తరహా తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.టిప్పర్ వాహన యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, సురక్షితంగా మరియు బాధ్యతతో వాహనాలను నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మెడికల్ కిట్ల పంపిణీ

- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపిఎస్ చేతుల మీదుగా అందజేత.
- వేసవి ఎండల దృష్ట్యా అత్యవసర సేవల కోసం ప్రత్యేక చర్య.
- డ్యూటీలో ఉన్న సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు కిట్ల వినియోగం. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఈరోజు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మెడికల్ కిట్లను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపిఎస్., అందజేశారు. తీవ్ర వేసవి ఎండల నేపథ్యంలో రహదారులపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది





ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది ఎండలు, కాలుష్యం, దీర్ఘకాలిక విధుల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని, వారి ఆరోగ్యం పరిరక్షణ పోలీస్ శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ మెడికల్ కిట్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే డ్యూటీలో ఉన్న సమయంలో ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు తక్షణ స్పందన కోసం ఈ కిట్లు ఉపయోగకరంగా ఉంటాయని, సిబ్బంది వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం మరియు ఆరోగ్య భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పి శ్రీమతి గీత కుమారి, సీఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# చిల్లకూరు జంక్షన్, పోటుపాళెం రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై స్పష్టత

## నిర్మాణం కోసం ఇప్పటికే రూ.45.82 మంజూరు అయినట్లు తెలిపిన ఎంపీ గురుమూర్తి



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు.

జాతీయ రహదారిపై చిల్లకూరు క్రాస్ రోడ్ (పోటుపాళెం రోడ్డు) వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ సమస్యను ఆయన తొలిసారిగా 14 జూన్ 2022న కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి కి లేఖ ద్వారా తెలియజేశారు. ఆ లేఖలో కృష్ణపట్నం పోర్టు ట్రాఫిక్, జాతీయ రహదారిపై రాకపోకల కారణంగా చిల్లకూరు జంక్షన్ వద్ద ట్రాఫిక్ తీవ్రంగా పెరిగిందని, భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆ లేఖలో వివరించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం లేదా రహదారి పునర్నిర్మాణం అత్యవసరమని కోరారు. అనంతరం పలు పర్యాయాలు ఆయనతో బేటీ అయిన ఎంపీ గురుమూర్తి ఈ అంశం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి ఈ అంశాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లేందుకు 2025 ఫిబ్రవరి 6న లోక్‌సభలో ప్రశ్న సంఖ్య 498 రూపంలో లేవనెత్తారు. చిల్లకూరు వెహికులర్ అండర్ పాస్ నిర్మాణానికి రూ. 45.82 కోట్ల అంచనాతో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఇందులోనే పాదచారుల రహదారిని సురక్షితంగా దాటేందుకు కూడా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని, పనులు ప్రారంభమైన తర్వాత సుమారు 15 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం భూ సేకరణ పనులు పురోగతిలో ఉన్నాయని సంబంధిత జాతీయ రహదారుల శాఖాధికారుల సమాచారం.

# అమరావతి హాస్పిటల్ 19వ వార్షికోత్సవం - సేవా దృక్పథంతో డయాలసిస్ కేంద్రం విస్తరణ



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

స్థానిక గూడూరు పట్టణంలోని ప్రముఖ వైద్యశాల అమరావతి హాస్పిటల్ 19వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శనివారం ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మరియు ప్రగతి కుటుంబ సభ్యులు హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణయ్య, నిర్మల దంపతులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాటల్లో: "గూడూరు ప్రాంత ప్రజలకు గత 18 ఏళ్లుగా అమరావతి హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలు ఎంతో అభినందనీయం. డాక్టర్ రమణయ్య కేవలం వైద్యుడిగానే కాకుండా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా ఈ ప్రాంతంలో మంచి గుర్తింపు పొందారు. నేడు 19వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, వారు మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. తెలియజేశారు, వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని హాస్పిటల్ అధినేతలు ఒక కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. వారు మాట్లాడుతూ:మెరుగైన డయాలసిస్ సేవలు: ప్రస్తుతం హాస్పిటల్‌లో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కిడ్నీ వ్యాధిగ్రస్తుల అవసరాలను గుర్తించి, రేపు (ఆదివారం) మరో 12 కొత్త డయాలసిస్ మిషన్లను ప్రారంభిస్తున్నాము. మొత్తం సామర్థ్యం: దీనితో హాస్పిటల్‌లో మొత్తం డయాలసిస్ మిషన్ల సంఖ్య 20కి చేరుకుంటుంది.

# ఎస్వీ డిఫెన్స్ కాలేజీ -గురుకుల పాఠశాలలో కార్యక్రమాల నిర్వహణ

## భద్రత, అప్రమత్తతపై కీలక సూచనలు



ప్రజా భూమి తిరుపతి 18:

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ మోసాలు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలను మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీమతి శ్రీలత, మరియు సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎస్వీ డిఫెన్స్ కాలేజీ మరియు గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేటి సమాజంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, మహిళలు మరియు బాలల భద్రత, విద్యార్థులు ఎదుర్కొనే వివిధ సమస్యలపై విపులంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచితులపై విశ్వాసం ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలి, అనుమానాస్పద కాల్స్, మెసేజులు, లింకులను స్పందించకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని, చట్టపరమైన సహాయం పొందడానికి ముందుకు రావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని, తమ సందేహాలను వ్యక్తపరచగా, అధికారులు సమగ్రంగా సమాధానాలు అందించారు. ఈ అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంలో దోహదపడతాయని తెలిపారు.

# కలెక్టర్ తో బేటి అయిన రెడ్డివారి గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.

తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ని వారి రాకార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తి ఈశ్వరుని వస్త్రముతో సత్కరించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి. తిరుపతి జిల్లా పరిధిలోని తిరుపతి కార్పొరేషన్ నందు గత ప్రభుత్వము కాలం నుండి పెండింగ్ ఉన్న గ్రంథాలయ చెస్ బకాయిలు రూపాయలు27 కోట్లు శ్రీకాళహస్తి మున్సిపాలిటీ నుండి రూపాయలు మూడు కోట్లు పుత్తూరు మున్సిపాలిటీ నుండి ఒక కోటి రూపాయలు మొత్తం 31 కోట్లు రూపాయలు గ్రంథాలయచెస్ రావలసి ఉండగా పంచాయతీల నుండి కూడా రావలసినటువంటి చెస్ బకాయిలను గ్రంథాలయాలకు త్వరగా ఇప్పించాలని వారికి వినతిపత్ర రూపంలో అందించడం దానికి వారు సానుకూలంగా స్పందించి త్వరలో ప్రత్యేక సమావేశాన్ని ఉమ్మడి జిల్లా గ్రంధాలయ చైర్మన్ జిల్లా కార్యదర్శి మరియు కమిషనర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలియపరుస్తూ సంబంధిత అధికారుల ను ఆ రూపంగా రూపకల్పన చేయాలని వారు ఆదేశించడం జరిగింది చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి . మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గ్రంథాలయాలు మునగడ ప్రశ్నార్ధకంగా ఉంది నిధులు కొరతతో ఉద్యోగులకు జీతం పెన్షన్ దారులకు పెన్షన్ ఇవ్వలేని స్థితి పాఠకులకు కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితుల్లో ఉంది అటువంటి పరిస్థితుల నుండి గ్రంథాలయాలకు రావాల్సినటువంటి 8% చెస్ బకాయిలు ఇప్పించాల్సిందిగా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు . మంత్రినారా లోకేష్ డిజిటల్ గ్రంథాలయాలు రూపకల్పన చేయాలని ఆలోచనలో ఉన్నారు అది సాధ్యం కావాలంటే నిధులు సాధ్యమైనంత విడుదల చేయాల్సిందిగా కలెక్టర్ ని కోరడం జరిగింది కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# శక్తి టీం అవగాహన కార్యక్రమం - మహిళల భద్రతపై చైతన్యం



ప్రజాభూమి తిరుపతి 18

శక్తి టీం సభ్యులు పెద్ద మార్కెట్ ప్రాంతంలో మూవింగ్ నిర్వహిస్తూ, అక్కడ ఉన్న మహిళలకు ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ (సైబర్ నేరాలు), చైల్డ్ లేబర్ (శిశు కార్మికత్వం), చైల్డ్ అబ్యూస్ (పిల్లలపై దుర్వినియోగం), ఉమెన్ ట్రాఫికింగ్ (మహిళల అక్రమ రవాణా) వంటి అంశాలపై వివరించారు.అదేవిధంగా డిజిటల్ అరెస్ట్ మోసాలు, చైన్ స్నాచింగ్స్ (బంగారు గొలుసులు లాక్కోవడం), గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి చుట్టుపక్కల తిరిగితే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. రాపిడో బైక్, ఆటో ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సూచనలు ఇచ్చారు.ఇక అత్యవసర సమయంలో ఉపయోగపడే శక్తి యాప్, 112 కాల్ సేవల గురించి వివరించి, ప్రతి మహిళ ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.మహిళలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను అరికట్టవచ్చని, భద్రత కోసం ముందస్తు జాగ్రత్తలు అత్యంత ముఖ్యమని శక్తి టీం స్పష్టం చేసింది.

# మాజీ పంచాయతీ పాలకులకు ఘన సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ రాజులకండ్రిగ పాఠశాల ఆవరణ నందు ఇటీవల పదవికాలం ముగిసిన పంచాయితీ పాలకులు మాజీ సర్పంచ్ కడివెళ్ల చెంగల్ రాజు మరియు మాజీ వైస్ సర్పంచ్ రాయపనేని జమున మరియు వార్డ్ మెంబర్లను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో మా గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలో అవసరమున్న చోట్ల సీసీ రోడ్లు వేశామని ఎంతో కాలంగా అపస్మృతంగా ఉన్న డ్రైనేజ్ సమస్య పరిష్కరించడమైనదన్నారు. పంచాయతీలో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చేసామన్నారు. లైట్ల సమస్యకు ఎంపీ నిధులతో గ్రామంలో సంపూర్ణంగా కొత్త లైట్లు వేశామన్నారు.ఇంకా గ్రామంలో పారిశుద్ధం పాటింపజేస్తూ గ్రామాభివృద్ధికి అనునిత్యం పాటుపడుతూ గ్రామంలో తాగునీటి సమస్య మరియు గ్రామంలో ఎటువంటి సమస్యలు రానీయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించడమైనదని ఈ ఐదేళ్ల ప్రజాసేవ సంతృప్తికరంగా ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పంచాయతీలోని గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం - అక్షయ తృతీయ నాడు జిల్లావ్యాప్తంగా 'విజిలెన్స్ డే'

ప్రజాభూమి ప్రతినిధి, గూడూరు,

బాల్య వివాహమనేది సామాజిక నేరమని, అక్షయ తృతీయ వంటి పర్వదినాల ముసుగులో పసిపిల్లల జీవితాలతో ఆడుకోవడం క్షమించరాని నేరమని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హెచ్చరించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం, ఐసీడీఎస్, ఐసీపీఎస్, 'చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ', 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' సంయుక్తాధ్వర్యంలో శనివారం నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడంతో




పాటు 'విజిలెన్స్ డే' (అప్రమత్తత దినోత్సవం) పాటించారు. అనంతరం ఈ అంశంపై రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

2030 నాటికి సంపూర్ణ మార్పు : చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఐ. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే జిల్లాలో బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గిందని హర్షం వ్యక్తం చేశారు. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' నెట్‌వర్క్ భాగస్వామ్యంతో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2030 నాటికి నెల్లూరు జిల్లాను 'బాల్య వివాహ రహిత జిల్లా'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం పంచాయతీలు, పాఠశాలలు, మత పెద్దలను భాగస్వాములను చేస్తున్నట్లు వివరించారు.

చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు : బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 (పిసిఎంఎ) ప్రకారం వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. నేరం రుజువైతే రెండేళ్ల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబ్ బి, ఐసీపీఎస్ అధికారిణి ఎస్. సుమలత మాట్లాడుతూ.. వివాహాల సీజన్‌లో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహ ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేటర్ గోవిందు శంకరయ్య, కౌన్సిలర్ మున్వర్ సుల్తానా, పొదుపు సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్

ఆదివారం, ఏప్రిల్ 19, 2026




# విద్యార్థుల నడవడికే వారి భవిష్యత్తుకు పునాది : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**పెదన బల్లిపర్రు గురుకులంలో రూ. 42 లక్షలతో నిర్మించిన సానిటరీ కాంప్లెక్స్ ప్రారంభం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటి, శ్రమదానం చేసిన కలెక్టర్**

**గుర్రపుడెక్క ఉత్పత్తులు, సేంద్రియ ఎరువుల ప్రదర్శన పట్ల హర్షం**

పెదన/మచిలీపట్నం (ప్రజా భూమి బ్యూరో కృష్ణాజిల్లా ):

విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పరిశుభ్రత, వేకువజామున నిద్రలేచి చదువుకోవడం వంటి అలవాట్లు చేసుకుంటే వారి జీవితాల్లో బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉద్బోధించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెదన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాలలో రూ. 42 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ను పెదన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ గారితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.విద్యార్థులకు దిశానిర్దేశం - కలెక్టర్ మాటల్లో..పరిశుభ్రత బాధ్యత మనదే: సానిటరీ కాంప్లెక్స్ నిర్మించడం సులభం, కానీ దానిని నిరంతరం శుభ్రంగా ఉంచుకోవడం విద్యార్థుల బాధ్యత. నెల తర్వాత మళ్లీ వస్తాను, అప్పుడు కూడా ఇలాగే పరిశుభ్రంగా ఉండాలి. ముందుచూపుతో చదవండి: ఉపాధ్యాయులు పాఠం చెప్పే ముందే ఆ అంశాన్ని ఒకసారి చదువుకుని వెళ్లాలి. క్లాసులో శ్రద్ధగా విని, ఇంటికి వెళ్ళాక మళ్ళీ రివిజన్ చేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.యోగాతో ఏకాగ్రత ఉదయాన్నే నిద్రలేచి యోగా చేయడం వల్ల మనసు అప్రమత్తమవుతుంది, ఇది చదువుకు ఎంతో మేలు చేస్తుంది.అభివృద్ధికి కలెక్టర్ ఆదర్శం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, విజయవాడ మాల్స్‌లో ఉండే తరహాలో అత్యాధునిక సౌకర్యాల తో ఈ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషకరమన్నారు. పర్యావరణ రక్షణ ఎండల తాపాన్ని తగ్గిం చేందుకు మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి గుర్రపుడెక్కతో చాపలు, బుట్టలు తయారు చేయడం గొప్ప విషయమని, నియోజకవర్గంలోని మల్లేశ్వరం, చేవేంద్రలలో నైపుణ్య కేంద్రాల ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడం కలెక్టర్ కృషికి నిదర్శనమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో కలెక్టర్ గారు నూటికి నూరు శాతం ఫలితాలు చూపిస్తున్నారని



ప్రశంసించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.శ్వారశాల ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యే స్వయంగా కాంపోస్ట్ గుంతను తవ్వి శ్రమదానం చేశారు.పస్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రపుడెక్కతో తయారు చేసిన చాపలు, బుట్టలు మరియు కాంపోస్ట్ ఎరువుతో పండించిన కూరగాయలను అధికారులు ఆసక్తిగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శివప్రసాద్, జడ్పీ సీఈవో డాక్టర్ జే. అరుణ, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కానూరులో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

**ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ**

మచిలీపట్నం రూరల్ (ప్రజా భూమి)





కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం కానూరు గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. స్థానిక స్వర్ణ గ్రామ కార్యాలయం మరియు గ్రామ ఆరోగ్య కేంద్రం (విలేజ్ హెల్త్ క్లినిక్) ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోపు సత్యనారాయణ స్వయంగా విలేజ్ హెల్త్ క్లినిక్ మరియు గ్రామ సచివాలయ పరిసరాలను శుభ్రం చేసి, గ్రామస్తుల్లో స్ఫూర్తిని నింపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ విని యో గాన్ని పూర్తిగా అరికట్టాలని ఆయన కోరారు.ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరువే రుగా సేకరించి, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచిం చారు. వ్యక్తిగత బాధ్యతగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను దూరం పెట్టినప్పుడే స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. ప్రజలంతా సమన్వయంతో పనిచేసి కానూరును ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి అనిగోపు సత్యనారాయణ తెలిపారు ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ మరియు గ్రామ పరిశుభ్రతపై అందరితో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్ర మంలో పంచాయతీ సెక్రటరీ వర ప్రసాద్, VRO సుబ్బయ్య దాస్, పీత రాము, గోపు వెంకటరమణ, బోలిశెట్టి నాని, గణపబత్తుల నాగ పాము, గణపబత్తుల యేసురాజు, పట్టపు శివన్నారాయణ, పట్టపు అబ్బులు, పోసిన వెంకటేశ్వరరావు, ఒడుగు ప్రేమ్ కుమార్, ఒడుగు యేసురాజు, స్వర్ణ గ్రామ సిబ్బంది, ANM & హెల్త్ సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు, బుక్ కీపర్స్, గోకపై విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ బోట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జల వనరుల పరిరక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు మంత్రి కొల్లు రవీంద్ర



**-ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి జల హారతి - జలధార'లో పాల్గొన్న మంత్రి చిన్న అవుటపల్లిలో స్వయంగా నీటి గుంత తవ్వి మదానం చేసిన నేతలు -ఉపాధి హామీ పథకం అమలుపై మంత్రి ఆరా.. పర్యావరణ పరిరక్షణకు పిలుపు**

గన్నవరం/చిన్న అవుటపల్లి (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా ):

పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం గన్నవరం నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. గన్నవరం మండలం చిన్న అవుటపల్లి గ్రామంలో నిర్వహించిన జలధార – జల హారతి కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర , ప్రభుత్వ విప్ మరియు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నేతల శ్రమదానం – నీటి సంరక్షణపై చైతన్యంఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగి, నీటి గుంత తవ్వకంలో పా ల్గొని శ్రమదానం చేశారు. భూమిలో పడే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాల్సిన అవస రం ఉందని, జల వనరుల పరిరక్షణలో ప్రజ లందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.నీటి బొట్టు.. జీవకో టికి ప్రాణాధారం. నీటిని వృధా చేయ కుండా సంరక్షించడం మనందరి బాధ్యత.ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను ప్రాధాన్యతతో చేపడుతోందని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు.ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషితో గన్నవరం ప్రగతిగన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా నిరంతరం శ్రమిస్తున్నారని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. ఎమ్మెల్యే తో కలిసి మంత్రి ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల వివరాలు, బిల్లుల చెల్లింపుల గురించి ఆరా తీశారు.జల వనరులకు శాస్త్రోక్తంగా హారతి ఇచ్చి, ప్రకృతిని గౌరవించాలని నేతలు సూచించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పచ్చదనం – పరిశుభ్రతతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రతి గ్రామం అడుగులు వేయాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య విజయం



**బిల్లు వీగిపోవడంలో రాహుల్ గాంధీ, ఖర్గే, షర్మిలమ్మల కృషి అమోఘం**

**మోదీ సర్కార్ కుట్రలను తిప్పికొట్టిన ఇండియా కూటమి**

**జిల్లా అధ్యక్షులు అందే శ్రీరామ్ మూర్తి**

**దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం చేసేలా మహిళా రిజర్వేషన్ లింకు పెడతారా? : పవన్‌ధీర్ శానం**

మచిలీపట్నం (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా)

పార్లమెంటులో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు శుభపరిణామమని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. శనివారం ఉదయం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పట్టాభి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు.1. ఇండియా కూటమి పోరాట ఫలితం అందే శ్రీరామ్ మూర్తిజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అందే శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ, పార్లమెంటులో 2/3 వంతు మెజారిటీ రాకపోవడంతో బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య విజయమన్నారు. దీని వెనుక ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే మరియు ఏపీపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల చేసిన పోరాటం విశేషమని కొనియాడారు.2. ప్రజలను తప్పుదోవ పట్టించడమే మోదీ నైజం కొడమంచలి చంద్రశేఖర్ జిల్లా జనరల్ సెక్రటరీ కొడమంచలి చంద్రశేఖర్ మాట్లాడుతూ, 2023లోనే ఆమోదం పొందిన బిల్లును మళ్ళీ ప్రవేశపెట్టి మోదీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందన్నారు. కేవలం 54 ఓట్ల తేడాతో



బిల్లును అడ్డుకుని ప్రజాస్వామ్యం తన సత్తా చాటిందని పేర్కొన్నారు.3. డిలిమిటేషన్ తర్వాతే మహిళా రిజర్వేషన్ శ్రీరామ పవన్‌ధీర్ శానంకాంగ్రెస్ నాయకులు శ్రీరామ పవన్‌ధీర్ శానం బిల్లులోని లోపాలను ఎత్తిచూపారు.మహిళా ప్రాతినిధ్యంపై అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, అమలు విధానంలో కేంద్రం తప్పు చేస్తోంది.పెరిగిన జనాభాకు అనుగుణంగా లోక్‌సభ స్థానాలు పెరగాలి. డీలిమిటేషన్ కమిషన్ ద్వారా రాష్ట్రాల వారీగా న్యాయమైన సీట్ల పంపిణీ జరగాలి.2011 జనాభా లెక్కల ఆధారంగా దక్షిణ రాష్ట్రాల సీట్లు తగ్గిపోయే ప్రమాదం ఉన్నందున, దానిని మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టడం వల్లనే విభేదాలు వచ్చాయని వివరించారు.4. ఇది మహిళల ఓటమి కాదు.. శక్తుల విజయం: విస్సంశెట్టి భాస్కర్మహిళలను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీపై బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని విస్సంశెట్టి భాస్కర్ హెచ్చరించారు. ఇది మహిళల బిల్లు ఓటమి కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తుల విజయమని ఆయన అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో చిల్లికోటి ప్రసాద్, మైనార్టీ నాయకులు సయ్యద్ నూరుద్దీన్, అత్తర్ జమాని బేగం, షేక్ గౌస్, గరికిపాటి శంకర్, ప్రసాద్ చౌదరి, నల్లబోలు సామ్యూల్, కోడూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వసంత నందిని తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరుల పవిత్ర హజ్ యాత్ర ప్రారంభం :మంత్రి కొల్లు రవీంద్ర

**గన్నవరంలో యాత్రికులకు వీడ్కోలు పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు**

**కూటమి ప్రభుత్వ అండతో సాకారం అవుతున్న ముస్లింల హజ్ కల రూ. లక్ష ఆర్థిక సాయం..**

**విజయవాడ విమానాశ్రయం నుండి యాత్ర షురూ**

గన్నవరం (ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా)





జీవితంలో ఒక్కసారైనా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లాలనే ప్రతి ముస్లిం సోదరుడి కలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే నజీర్, మాజీ ఛైర్మన్ షరీఫ్, అబ్దుల్ అజీజ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, పచ్చజెండా ఊపి యాత్రను ఘనంగా ప్రారంభించారు.మైనార్టీల అభివృద్ధికి కూట మి ప్రభుత్వం కట్టుబడి ఉంది కొల్లు రవీంద్రఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ముస్లిం సోదరుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని గర్వంగా చెబుతున్నామన్నారు.ఆర్థిక తోడ్పాటు యాత్రికులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తరపున రూ. లక్ష ఆర్థిక సాయం అం దించడం అభినందనీయమన్నారు.రికార్డు స్థాయిలో ప్రయాణం: ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ నుండి మొత్తం 1,987 మంది హజ్ యాత్రకు వెళ్తుండగా, ఒక్క విజయవాడ నుండే 353 మంది ప్రయా ణించడం విశేషమన్నారు.ఘనంగా వీడ్కోలు పలికిన యార్లగడ్డ వెంకట్రావుగన్నవరం నియోజకవర్గ పరిధిలోని విమానాశ్రయం నుండి యాత్రికులు బయలుదేరడం పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విమానాశ్రయం మరియు కన్వెన్షన్ హాల్ వద్ద అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ఫొటోలు దిగి, వారి ప్రయాణం సుఖమయం కావాలని ఆకాంక్షించారు.పవిత్ర ప్రయాణం గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్ నుండి యాత్రికులు ప్రత్యేక బస్సుల్లో విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆత్మీయ పలకరింపు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి ఒక్క యాత్రికుడిని పేరుపేరునా పలకరించి, పవిత్ర యాత్రలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించాలని కోరారు.మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించగా, యార్లగడ్డ వెంకట్రావు మరియు ఇతర నేతలు యాత్రికులకు వీడ్కోలు పలకడంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.పాల్గొన్నవారు:ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, హజ్ కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు మరియు యాత్రికుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలిసెట్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**వై.జె.ఆర్.డి.ఎం.ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు**

మచిలీపట్నం (రూరల్ ప్రజాభూమి)



స్థానిక వై.జె.ఆర్.డి.ఎం.ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యా ర్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల భవిష్యత్తు, డిప్లొమా విద్య ప్రాముఖ్యతపై పలువురు వక్తలు దిశానిర్దేశం చేశారు.డిప్లొమాతో అపారమైన అవకాశాలుకళాశాల డిప్లొమా ఇంచార్జి టి. నాంచారయ్య మాట్లాడుతూ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక రం గంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నా యని, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రవికుమార్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) కోసం కళాశాల యాజమాన్యం అందిస్తున్న ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన శిక్షణ ద్వారా మంచి ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి వీరమాచినేని కిరణ్, ప్రిన్సిపాల్ టి. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి. నాగజ్యోతి, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గడ్డం రాజు హెచ్చరికతో దిగివచ్చిన బీసీవై పార్టీ

**పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలకు తమకు సంబంధం లేదని ప్రకటన**

కృష్ణా జిల్లా మచిలీపట్నం (ప్రజాభూమి ప్రతినిధి)



గడ్డం రాజు చేసిన ఘాటు విమర్శలు, డిమాండ్లపై బీసీవై పార్టీ (BCY) తక్షణమే స్పందించింది. పవన్ కళ్యాణ్ గారిపై జరిగిన అనుచిత వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ మంగళగిరి పార్టీ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేసింది.బీసీవై పార్టీ వివరణ దీక్షకు సంఘీ భావం తెలిపే క్రమంలో ఒక నాయకుడు చేసిన వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమని, పార్టీ సిద్ధాంతాలకు వాటికి సంబంధం లేదని పేర్కొంది.గౌరవిస్తాం తమ నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ రాజకీయ ప్రత్యర్థులను ఎప్పుడూ గౌరవిస్తారని, వ్యక్తిగత దూషణలను ప్రోత్సహించరని వివరణ ఇచ్చారు.తమ పోరాటం కేవలం ప్రభుత్వ విధానాల పైనే తప్ప, వ్యక్తులపై కాదని బీసీవై పార్టీ స్పష్టత నిచ్చింది.మొత్తా నికి జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తనదైన శైలిలో విరుచుకుపడటంతో, పవన్ కళ్యాణ్ పై అను చిత వ్యాఖ్యలు చేసిన అంశంలో బీసీవై పార్టీ ఆత్మరక్షణలో పడింది. గడ్డం రాజు చూపిన చొరవతోనే బీసీవై పార్టీ బహిరంగంగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందని జనసేన శ్రేణులు భావిస్తున్నారు.

# యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమే..!

**- నిరూపించిన టీడీపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు- ఆయన ఎదుగుదల.. యువతకు అదర్శం- కార్యకర్త నుంచి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం**

అమరావతి ప్రజా భూమి ప్రతినిధి

భారతీయ రాజకీయాల్లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ స్థాయి నాయకత్వానికి ఎద గడం చాలా అరుదైన విషయం. అయితే, అలాం టి అవకాశాలను సృష్టించే రాజకీయ వేదికగా తెలుగుదేశం పార్టీ నిలిచిందనే విషయాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, క్రమంగా పార్టీకి కీలక వ్యూహకర్తగా, చివరకు జాతీయ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగిన విధానం, పార్టీ అంతర్గత వ్యవస్థలో ఉన్న సామర్థ్యాన్ని, క్రమశిక్షణను తెలియజేస్తోంది.ప్రారంభం నుంచి ప్రగతి దిశగా :2011లో పార్టీ క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగంలో అడుగుపెట్టిన సతీష్ బాబు, మొదటి నుంచే చురుకుదనం, కట్టుబాటు, అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. స్థానిక స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా నాయకత్వ దృష్టిని ఆకర్షించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసం, సంస్థాగత కట్టుబాటు, ప్రజలతో మమేకమయ్యే తీరు ఆయన ఎదుగుదలకు బలమైన పునాది అయ్యాయి.ఈ దశలోనే ఆయనలోని నిర్వహణా నైపుణ్యం, సమన్వయ సామర్థ్యం పార్టీ పెద్దల దృష్టికి వచ్చాయి. దాంతో క్రమంగా ఆయనకు పార్టీ లోపలి కీలక బాధ్యతలు అప్పగించబడుతూ వచ్చాయి. ఒక కార్యకర్త నుంచి బాధ్యతాయుత నాయకుడిగా మారే ప్రక్రియలో ఆయన చూపిన స్థిరత్వం, కృషి రాజకీయాల్లో ఎదగాలనుకునే యువతకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది.

ఎన్నికల వ్యూహకర్తగా ప్రతిభ :2024 సాధారణ ఎన్నికలు సతీష్ బాబు రాజకీయ జీవితంలో కీలక మలుపు. ఉమ్మడి గోదావరి జిల్లాలకు ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా నియమితులైన ఆయన, ఆ బాధ్యతను కేవలం పరిపాలనా కోణంలో కాకుండా వ్యూహాత్మకంగా నిర్వహించారు. స్థానిక సామాజిక సమీకరణలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళికలు, మైక్రో మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో సమర్థవంతమైన సమన్వయం చూపించారు. ఆయన సమన్వయంతో ఆ ప్రాంతంలో 21మంది ఎమ్మెల్యేలు, 3 మంది ఎంపీలు విజయం సాధించడం విశేషం. ఈ ఫలితాలు కేవలం ఎన్నికల విజయాలుగా కాకుం డా, ఆయన వ్యూహాత్మక సామర్థ్యానికి నిదర్శ నంగా నిలిచాయి. ఎన్నికల రాజకీయాల్లో గ్రౌండ్ లెవల్ డైనమిక్స్‌ను అర్థం చేసుకుని వాటిని ఫలితాలుగా మార్చగల నాయకుడిగా ఆయన ప్రతిష్ఠ పెరిగింది. ఉద్యమాల్లో చురుకుదనం – యువగళం ప్రభావం :పార్టీ కార్యకలాపాల్లో మాత్రమే కాకుండా ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు చురుకైన పాత్ర పోషించారు. నారా లోకేష్ చేపట్టిన "యువగళం" పాదయాత్రలో ఆయన పాల్గొనడం, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో కీలకంగా మారింది.

ఈ యాత్రలో ఆయన చేసిన గ్రౌండ్ కనెక్ట్ కార్యక్రమాలు, స్థాని క సమస్యలపై స్పందన, యువతతో నేరుగా మమేకమయ్యే విధానం పార్టీకి కొత్త శక్తిని అం దించాయి.అలాగే, నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అనంతరం జరిగిన ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు ముందుండి పోరాటం చేశారు. పార్టీకి అనుకూల పరిస్థితులు లేకపోయినా, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపడం, సమన్వయం చేయడం, ఉద్యమాలను ముందుకు నడిపించడం వంటి అంశాల్లో ఆయన నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపించాయి.రాజ్యసభ నుం చి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు :పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం, 2024 డిసెంబర్‌లో ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నియమించడం ద్వారా విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత పురోగతి మాత్రమే కాదు, పార్టీకి ఆయన అందించిన సేవలకు ప్రతిఫలం కూడా.ఇక 2026 ఏప్రిల్‌లో పార్టీ సంస్థాగత





మార్పుల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, సీఎం చంద్రబాబు పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో కొత్త బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నారా లోకేష్‌ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించగా, సానా సతీష్ బాబును జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించడం పార్టీ భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారింది.ఈ నియామకం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువ నాయకత్వానికి ప్రాధాన్యం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సతీష్ బాబు వంటి నాయకులు జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణకు కొత్త దిశను అందిస్తారని భావిస్తున్నారు. సమన్వయం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు :జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సతీష్ బాబు తన దృష్టిని కేంద్ర–రాష్ట్ర సమన్వయంపై కేంద్రీకరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడం, పెట్టుబడులను ఆకర్షించడం, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు అందించడం వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేకంగా ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చూపుతున్న చొరవ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రంతో సమన్వయం పెంచడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని అవకాశాలను తీసుకురావాలనే దిశగా ఆయన కృషి కొనసాగుతోంది.నాయకత్వంపై విశ్వాసం – భవిష్యత్ దిశఈ సందర్భంగా సతీష్ బాబు, తనపై నమ్మకం ఉంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే, నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.ముగింపు: కార్యకర్తకు అవకాశమిస్తే నాయకత్వం ఎలా రూపుదిద్దుకుంటుందో…సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం ఒక వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు; అది ఒక సంస్థాగత మోడల్‌కు ప్రతిరూపం. క్రమశిక్షణ, కృషి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఉంటే, ఒక కార్యకర్త కూడా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగవచ్చని ఆయన ప్రయాణం చెబుతోంది.ఈ ప్రస్థానం, ముఖ్యంగా యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమనే సందేశాన్ని ఇస్తోంది. పార్టీకి కట్టుబాటు, ప్రజలతో అనుసంధానం, సమర్థవంతమైన నిర్వహణ ఉంటే, రాజకీయాల్లో ఉన్నత స్థానాలు అందుబాటులో ఉంటాయని సతీష్ బాబు ఉదాహరణగా నిలుస్తున్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 59-2-1,Ashoknagar 1st lane.Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh and Published from D.NO. 59-2-1,Ashoknagar1st lane,Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677